WiFI

# మహిళా -ఐసిటి

## సవాళ్ళు - సాధన

# మహిళా సాధికారికత సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు - ఐసీటీ

(పర్వ్రిక 1)

ఐక్యరాజ్యసమితి
ఎపిసిఐసిటి - ఎస్కాప్

## పర్వ్రిక 1

# మహిళా సాధికారిక
# సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు – ఐసీటీ

ఐక్యరాజ్యసమితి ఏపీసీఐసీటీ - ఈఎస్‌సీఏపీ

# విషయ సూచిక


కృతజ్ఞతలు v
సంక్షిప్త పదాల జాబితా vi
ముందుమాట vii
ఈ పర్వం (మాడ్యూల్) గురించి viii
1 పరిచయం 1
2. మహిళా సాధికారిక ప్రాధాన్యం ఎందుకు?
2.1 ప్రాజెక్టు అవసరం
నిదర్శనాధ్యయనం 1. ఓ దక్షిణాసియా మహిళ 3
నిదర్శనాధ్యయనం 2. అటెఫీ స్థానిక రైతుల ఆదాయాన్ని ఎలా పెంచారు 4
2.2 మహిళా సాధికార - సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు 5
2.3 మహిళా సాధికారిక కోసం ఐసీటీ 7
నిదర్శనాధ్యయనం 3. మహిళల డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమం 7
3. మహిళా సాధికారికకు అవరోధాలు - సహాయకారకాలు
3.1 అవరోధాలు 8
3.1.1 వివక్షా పూరిత సామాజిక నియమాలు - సంస్కృతి 8
నిదర్శనాధ్యయనం 4. సౌమ్య సవాళ్లను ఎలా ఎదుర్కొంది... 11
3.1.2 లింగ పక్షపాత చట్టాలు - నియంత్రణ వాతావరణం 12
3.1.3 ప్రభుత్వ సేవల పరిమిత అందుబాటు 14
3.1.4 మహిళలపై హింస 16
3.2 సహాయ కారకాలు 16
3.2.1 పాత్రధారులుగా ఇతర భాగస్వాములు 16
నిదర్శనాధ్యయనం 5. భారత్‌లో హింసకు వ్యతిరేకంగా గళమెత్తడం 17
3.2.2 న్యాయ సంస్కరణలు - ప్రతిస్పందనలు 17
3.2.3 మహిళల రాజకీయ భాగస్వామ్యం పెంపు 18
3.2.4 మహిళల కోసం విద్యాసేవల మెరుగుదల 18
3.2.5 ఐసీటీ వినియోగం 19
4. మహిళా సాధికారికకు ఐసీటీ 20
4.1 ఐసీటీ అంటే ఏమిటి? 20
4.2 మహిళా సాధికారికకు ఐసీటీ అవకాశాలు 21
4.2.1 సమాచారం అందుబాటు, సందేశ ఆదానప్రదానాల్లో పెరుగుదల 21
నిదర్శనాధ్యయనం 6. తజిక్‌మమా యాప్ 22
4.2.2 ప్రభుత్వ సేవల అందుబాటు 23
నిదర్శనాధ్యయనం 7. మేమే యాప్ 24
4.2.3 సామాజిక-ఆర్థిక భాగస్వామ్యానికి అవకాశాలు 25
నిదర్శనాధ్యయనం 8. ఉసాహ వనిత మొబైల్ సేవ 26

4.2.4 రాజకీయ భాగస్వామ్యానికి అవకాశాలు 27
4.3 ఐసీటీ వినియోగంలో మహిళలకు సవాళ్లు 28
5. సారాంశం 30

## చిత్రాల జాబితా

చిత్రం 1 : మహిళలపై ఎలాంటి ప్రతిఫలం లేని పనుల అధికభారం

చిత్రం 2 : సంపద, లైంగికతల పరంగా వివిధ దేశాల్లో పాఠశాల విద్య పూర్తిచేసేవారి సంఖ్య

## పట్టికల జాబితా

పట్టిక 1 : ప్రపంచవ్యాప్తంగా వివాహిత మహిళలపై చట్టపరమైన ఆంక్షల సంక్షిప్త చిత్రణ

# కృతజ్ఞతలు

*ఈ శిక్షణ సరంజామాపై బహుళ దశల్లో సమీక్షలో పాల్గొన్న, దీంతోపాటు ఈ పర్యికను రూపొందించడం కోసం అమూల్యమైన సంసిద్ధక సామగ్రి అందించిన భాగస్వాములందరికీ ఏపీసీఐసీటీ కృతజ్ఞతలు తెలుపుతోంది. అలాగే పాకిస్థాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఐసీటీఎస్ ఫర్ డెవలప్‌మెంట్ (PIID), ఫిలిప్పైన్స్‌కు చెందిన కెరీర్ ఎగ్జిక్యూటివ్ సర్వీస్ బోర్డు (CESB)లకూ ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. అంతేకాకుండా సంప్రదింపుల సమావేశాలు, నిపుణుల బృందం సమావేశాలు, సదస్సులు, క్షేత్రస్థాయి ప్రయోగాలు తదితరాల్లో పాలుపంచుకున్న భాగస్వాములకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ పర్యికకు సంపూర్ణ స్వరూపం ఇవ్వడంలో ఫాహీమ్ హుసేన్, మరియా జూనిటా ఆర్.మకపాగల్, ఉషారాణి వ్యాసుల రెడ్డి, సయూరి కొక్కో ఒకాడా, జానకి శ్రీనివాసన్ ఎంతగానో సహకరించారు. వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నాం. అలాగే ఈ పర్యికకు క్రిస్టీన్ ఎపికుల్ తన సంపాదకత్వంలో అద్భుతంగా తీర్చిదిద్దినందుకు ధన్యవాదాలు.*

వైపై - **మాడ్యూల్** ను తెలుగు భాషలోకి తీసుకురావడానికి కీలకపాత్ర వహించిన ఆచార్య వి. దుర్గాభవానిగారు, ఉపకులపతి, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి, ఆంధ్రప్రదేశ్, భారతదేశం వారికి;ఆచార్య పి.విజయలక్ష్మి కమ్యూనికేషన్ - జర్నలిజం శాఖవారికి ధన్యవాదాలు. ఈ మాడ్యూల్ ను సమీక్షించిన డా.టి. శోభారాణి, డా.వై. సుభాషిణీలకు కృతజ్ఞతలు.

## భారత దేశంలో వైపై టీమ్

**ఆచార్య ఉషారాణి వ్యాసుల రెడ్డి**

**ఆచార్య వి.దుర్గాభవాని**, కమ్యూనికేషన్ - జర్నలిజం శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం.
**ఆచార్య పి.విజయలక్ష్మి**, కమ్యూనికేషన్ - జర్నలిజం శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం.

# సంక్షిప్త పదాల జాబితా

| | |
|---|---|
| APCICT | ఆసియా–పసిఫిక్ ఐసీటీ అభివృద్ధి కేంద్రం |
| C1 | వైఫై కీలక సరంజామా – పర్విక సి1: మహిళా సాధికారిక, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు–సమాచార, సందేశ సాంకేతికత |
| C2 | వైఫై కీలక సరంజామా – పర్విక సి2: మహిళా పారిశ్రామికులకు సహాయకారిగా ఐసీటీ పాత్ర |
| CEO | ముఖ్య కార్యనిర్వహణాధికారి |
| ESCAP | ఆసియా, పసిఫిక్ సామాజిక–ఆర్థిక కమిషన్ |
| FAO | ఆహార, వ్యవసాయ సంస్థ (ఐక్యరాజ్య సమితి) |
| GDP | దేశీయ స్థూలోత్పత్తి |
| GSMA | అంతర్జాతీయ మొబైల్ ఆపరేటర్ల సంఘం |
| ICT | సమాచార, సందేశ సాంకేతిక పరిజ్ఞానం |
| ITU | అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ |
| MDG | శతాబ్ది అభివృద్ధి లక్ష్యం |
| PSI | అంతర్జాతీయ జనాభా సేవల సంస్థ |
| SDG | సుస్థిర అభివృద్ధి లక్ష్యం |
| SMS | సంక్షిప్త సందేశ సేవ |
| STEM | శాస్త్ర, సాంకేతిక, ఇంజనీరింగ్, గణితం |
| UN | ఐక్యరాజ్య సమితి |
| UNDP | ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం |
| UNESCO | ఐక్యరాజ్య సమితి విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ |
| W1 | వైఫై మహిళా పారిశ్రామికుల బాట – పర్విక డబ్ల్యూ 1 : ఐసీటీ సాయంతో వ్యాపార ప్రణాళిక |
| W2 | వైఫై మహిళా పారిశ్రామికుల బాట – పర్విక డబ్ల్యూ 2 : ఐసీటీ సాయంతో వ్యాపార నిర్వహణ |
| WIFI | మహిళలు – ఐసీటీ ప్రాంతీయ కార్యారంభం |

# ముందుమాట

**ప**రిశ్రమ సంబంధ విజ్ఞానస్థాయిని పెంచడానికి, ఆర్థిక-వాస్తవ విపణి సమాచారాన్ని నిరంతరం అందుబాటులో ఉంచుకోవడానికి తోడ్పడే ఉపకరణాలను సమాచార, ప్రసార సాంకేతిక పరిజ్ఞానాలు (ICTs) అందిస్తాయి. ఆ మేరకు 2030నాటికి నిర్దేశించుకున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (SDG )సాధన కృషిపై ఐసీటీలు చూపగల ప్రభావాన్ని ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలలో అనేకం ఇప్పటికే గుర్తించాయి. **"లింగ సమానత్వంతోపాటు మహిళలు, బాలికల సాధికారిక"** (SDG 5)ను సాధించే ధ్యేయంతో ప్రత్యేకించి మహిళా సాధికారిక (లక్ష్యం 5బి)ను ప్రోత్సహించడం కోసం ఐసీటీని మరింతగా వినియోగించాలని పిలుపునిచ్చాయి.

**సా**మాజిక, ఆర్థికాభివృద్ధికి సమర్థ సహాయక ఉపకరణాలుగా ఐసీటీలను ప్రపంచమంతా గుర్తించింది. అయితే, వీటిపై అవగాహన లోపంతోపాటు వినియోగ సామర్థ్యం లేక వర్ధమాన దేశాల మహిళా పారిశ్రామికులు ఇబ్బందులు పడుతున్నారు. పేదరికం, మధ్యలోనే చదువు ఆపేయడం, ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితులు వంటి సామాజికాంశాలే అందుకు కారణం. అంతేగాక కొన్ని దేశాలలో ఇంటర్నెట్ ఉపయోగించడం, వ్యాపారం చేయడం వంటివి మహిళలు చేయదగినవి కావన్న ఆంక్షలు ఉండటమూ మరో కారణం.

**ఈ** నేపథ్యంలో ఆసియా, పసిఫిక్ సామాజిక-ఆర్థిక కమిషన్ (ESCAP) పరిధిలో ఆసియా-పసిఫిక్ ఐసీటీ అభివృద్ధి కేంద్రం (APCICT) 2006 జూన్‌లో ఏర్పాటైంది. ఎస్కాప్ సభ్య దేశాలలో సుస్థిర అభివృద్ధి కోసం ఐసీటీలను వినియోగించగల మానవ, సంస్థాగత సామర్థ్యాన్ని పెంపొందించడమే APCICT ఏర్పాటు ప్రధాన లక్ష్యం. ఆ మేరకు ప్రభుత్వాధినేతలు, ఉన్నతాధికారులు, విద్యార్థులుసహా యువతరంలో సామర్థ్య నిర్మాణం కోసం పలు కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తుంది. ఇందులో భాగంగానే ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో మహిళల సామాజిక, ఆర్థిక సాధికారికకు ఐసీటీ సమర్థ పారిశ్రామికతద్వారా మద్దతునిచ్చేందుకు **"మహిళలు-ఐసీటీ ప్రాంతీయ కార్యారంభం"** **(WIFI)** పేరిట ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి APCICT శ్రీకారం చుట్టింది.

**సా**ధికారిక, పారిశ్రామికత భావనల మూలాలను వైఫై పర్విక (మాడ్యూల్స్)లు పాఠకులకు వివరిస్తాయి. ఓ చిన్న వ్యాపారాన్ని ప్రారంభించడం, నిర్వహించడంపై ప్రాథమిక అవగాహన కల్పిస్తాయి. ఐసీటీ పరిజ్ఞానం పొందిన మహిళా పారిశ్రామికులకు అనువైన విధానాలు, కార్యక్రమాల రూపకల్పనతోపాటు తగు సేవలందించేలా పాలకుల, విధాన రూపకర్తల సమర్థతను బలోపేతం చేస్తాయి. ఈ శిక్షణ విభాగాల అదనపు వనరులలో శిక్షకులకు తోడ్పడే సంధానకర్తల మార్గసూచి కూడా ఒకటిగా ఉంటుంది. పారిశ్రామికత కోసం ఐసీటీ వినియోగానికి తగిన సరంజామా అందించడం, వైఫై సమాచార నిధివంటివి అనుబంధ వనరులుగా ఉంటాయి. అభివృద్ధి, అమలు, అందజేత (D.I.D) లకు భరోసా ఇస్తూ "మేం భాగస్వామ్య విధానం అనుసరిస్తున్నాం" అనే పద్ధతిలో వైఫై కార్యక్రమాన్ని APCICT నడిపించింది. మహిళా పారిశ్రామికత ప్రగతికి ఐసీటీ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలన్న ఉమ్మడి లక్ష్యంగల ప్రభుత్వాలు-వాటాదారులతో కూడిన భాగస్వాములు, పౌర సమాజం, మహిళా సంఘాలు, ప్రైవేటురంగం, ఇతర సంస్థల సహకారంతోనే వైఫై కార్యక్రమం రూపొందింది.

**ఐ**సీటీద్వారా మహిళా సాధికారిక అనే భాగస్వామ్య లక్ష్యాన్ని సాధించడంలో వైఫై కార్యక్రమం అర్థవంతమైన దోహదకారి కాగలదన్నది మా ప్రగాఢ విశ్వాసం.

**హ్యూన్-సుక్ రీ**

**సంచాలకులు**

**ఐక్యరాజ్యసమితి-ఏపీసీఐసీటీ/ఈఎస్సీఏపీ**

## ఈ పర్వం గురించి...

దిగువ పేర్కొన్న కీలక భావనలను పరిచయం చేయడమే ఈ పర్విక ప్రధాన లక్ష్యం.

### సాధికారిక

- ప్రస్తుత పరిస్థితులలో మహిళా సాధికారిక, దానికిగల అడ్డంకులు, అధిగమించే మార్గాలు
- మహిళా సాధికారికను ప్రోత్సహించడంలో ఐసీటీకిగల అవకాశాలు–ఎదురయ్యే సవాళ్లు
- మహిళా సాధికారిక సాధనకు సంబంధించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు

ఈ పర్వికలో మూడు ప్రధాన విభాగాలున్నాయి. అనేక అధ్యయనాలు, వాస్తవ ప్రాపంచిక ఉదాహరణల తోడ్పాటుతో కీలక భావనలను వీటిద్వారా వివరించాం. ప్రతి విభాగం నిర్దేశిత పరస్పర కసరత్తులతో ముగుస్తుంది ప్రస్తుత, వర్ధమాన మహిళా పారిశ్రామికులు, సామాజిక నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థలు, విధాన రూపకర్తలు, ప్రభుత్వాధికారులు, సంబంధిత భాగస్వాములే ఈ పర్విక లక్ష్యం. లక్షితవర్గాలకు శిక్షణ ఇవ్వడంపైనా, సంబంధింత సరంజామాను స్థానిక పరిస్థితులకు తగినట్లు మరింత మెరుగుపరచడంపైనా శిక్షకులు తగిన సూచనలిచ్చేందుకు అవసరమైన సారాంశం ఈ పర్విక చివరన అందుబాటులో ఉంటుంది.

### అభ్యాస ఫలితాలు

ఈ పర్వికను పూర్తిచేసిన తర్వాత అభ్యాసకులు:

- సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణమైన మహిళా సాధికారిక భావన గురించి వివరించగలరు.
- మహిళా సాధికారికకుగల అవరోధాలు, అనుకూలతలను విశదీకరించలరు.
- మహిళా సాధికారికకు ఐసీటీ ఏ విధంగా మద్దతివ్వగలదన్న అంశంపై నిర్దిష్ట ఉదాహరణలు ఇవ్వగలరు.

ప్రస్తుత, కాబోయే మహిళా పారిశ్రామికులే ఈ పర్విక లక్షిత అభ్యాసకులు. ఐసీటీ పరిజ్ఞానంగలవారు, ఇప్పటికే వివిధ ప్రాథమిక అవసరాల (ఉదా॥ ఫోన్ చేయడం, సంక్షిప్త సందేశం పంపడం, ఈ–మెయిల్ వగైరా) కోసం ఐసీటీని వినియోగిస్తున్న మహిళలు దీనివల్ల ప్రయోజనం పొందగలరు. అలాగే మరింత ఆధునిక వ్యవహారాల (మార్కెటింగ్, ఆన్‌లైన్‌లో ఉత్పత్తుల/సేవల విక్రయం) కోసం ఐసీటీ ఉపకరణాలను వాడుకోవడంపై వీరికి ఆసక్తి ఉండీ ఇప్పటిదాకా వినియోగించుకోనివారు కూడా లబ్ధి పొందగలరు. అంతేగాక ఇప్పటికీ ఐసీటీని ఉపయోగించనివారికి ప్రాథమిక, సాధారణ అవగాహన కల్పించేందుకు ఈ పర్విక ఉపయోగకరం. అభ్యాసకులకు అవగాహన, పరిజ్ఞానం కల్పించడమేగాక మహిళా పారిశ్రామికులు దాన్ని తమ వ్యాపారాలలో వినియోగించుకునే ప్రయోగాత్మక విధానంతో ఈ పర్విక రూపొందించబడింది.

### లక్షిత వర్గాలు

కాబోయే, వ్యాపార తొలిదశలోని మహిళా పారిశ్రామికులు, విధాన రూపకర్తలు, ప్రభుత్వాన్ని నడుపుతున్నవారే లక్షితవర్గాలు

### శిక్షణ సమయం

ఆరు గంటలు/ఒక శిక్షణ దినం

## 1. పరిచయం

**ఐ**క్యరాజ్యసమితిలోని సభ్యదేశాలన్నీ సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధన దార్శనికత దిశగా 2015లో సామూహిక అంగీకారానికి వచ్చాయి. ఆ మేరకు అభివృద్ధి కృషికి మార్గదర్శనం చేసే 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యా (SDG)లను నిర్దేశించుకున్నాయి. సార్వజనీనత ధ్యేయంగా ప్రగతివైపు సాగే ఈ ప్రయాణంలో భాగంగా అవకాశాల కల్పనలో ఏ ఒక్కరినీ సమాజం విస్మరించరాదన్నది ఇందులోని ప్రాథమిక నియమం. ప్రత్యేకించి అభ్యాసం, వ్యాపారం, సామాజిక- ఆర్థిక అను సంధాన క్రమాల్లో అవకాశాల నుంచి మహిళలు లబ్ధి పొందాలి. ఇలా అవకాశాల్లో భాగస్వామ్యం, శిక్షణనందించడం, సమాచార సేకరణలకు వీలు కల్పించే వేదికగా సమాచార, సందేశ సాంకేతిక పరిజ్ఞానా (ICT)లను లోతుగా అనుసంధానించారు. సుస్థిర అభివృద్ధిలో మహిళా సాధికారిక ఎంత ముఖ్యమైన అంతర్భాగమో ఈ పర్విక వివరిస్తుంది. అంతిమంగా మహిళలకు సాధికారిక కల్పించి సుస్థిర అభివృద్ధివైపు సామూహిక పయనంలో వారిని భాగస్వాములను చేసేందుకు ఐసీటీలను ఎంతగా వినియోగించుకోవచ్చునో కూడా వివరిస్తుంది.

## 2. మహిళా సాధికారికకు ప్రాధాన్యం ఎందుకంటే...

**"సాధికారిక అంటే- ప్రజలంతా... స్త్రీ, పురుషులిద్దరూ తమ జీవితాలను తాము నియంత్రించుకోవడం; స్వీయ కార్యాచరణను నిర్దేశించుకోవడం, నైపుణ్యం సాధించడం (లేదా తమ సొంత నైపుణ్య-విజ్ఞానాలకు గుర్తింపు తెచ్చుకోవడం), ఆత్మవిశ్వాసం పెంచుకోవడం, సమస్యలను పరిష్కరించుకోవడం, స్వావలంబనను అలవరచుకోవడమే."**

**ఐరాస మహిళా విభాగం, మహిళా సాధికారిక సూత్రాలు 2011**

---

**అభ్యాస ఫలితాలు**

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు-2015 (SDG)కు అనుగుణంగా మహిళా సాధికారిక భావన గురించి వివరించగలరు.

---

### 2.1 మహిళా సాధికారిక అంటే ఏమిటి?

**ప్ర**పంచ ఆర్థిక వేదిక (World Economic Forum) రూపొందించిన అంతర్జాతీయ లింగ వ్యత్యాస నివేదిక-2015 ప్రకారం ప్రపంచంలోని ఏ దేశమూ లింగ వ్యత్యాసాన్నిగానీ, సామాజిక- ఆర్థికాభివృద్ధిలో భాగస్వామ్యం, అవకాశాలపరంగా స్త్రీపురుషులలో అంతరాలనుగానీ పూర్తిగా తగ్గించలేకపోయింది. ప్రత్యేకించి ఆర్థిక భాగస్వామ్యంలో లింగపరమైన అసమానత 59 శాతంగా ఉంది. లింగ సమానత్వమే కీలకమంటున్న అనేక అంతర్జాతీయ మానవ హక్కుల సిద్ధాంతాల కట్టుబాటుకు ఇది వ్యతిరేకం. ఈ లింగపరమైన వ్యత్యాసం ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధిని వెనక్కు నెడుతుందనే వాస్తవంతో అంగీకరిస్తున్నవారి సంఖ్య నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో మహిళా సాధికారిక అవశ్యమంటున్నవారి గళం మరింత బిగ్గరగా వినిపిస్తోంది.

**వ్య**క్తులకేగాక సమాజహితం దిశగానూ ఎంపికలు, అవకాశాలను పెంచే మార్పు ప్రక్రియగా సాధికారికకు విస్తృత నిర్వచనం ఉంది. ఆ మేరకు మహిళలకు సాధికారిక కల్పించడమంటే సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితాల్లో వారి పూర్తి భాగస్వామ్యానికి భరోసా ఇవ్వడమే. వ్యక్తులు తమ జీవితాలకు సంబంధించి మెరుగైన వ్యూహాత్మక కార్యాచరణను నిర్ణయించుకునే అవకాశాలు అంతిమంగా వారి ఆర్థిక, సామాజిక మెరుగుదలకు ఉపయోగపడతాయి. అభివృద్ధి చెందిన సమాజంలో సాధికారక సాధించిన మహిళలు ఒక ముఖ్యమైన అంతర్భాగం. ఆరోగ్య సంరక్షణ, విద్య, జీవనోపాధి, రాజకీయ భాగస్వామ్యం తదితరాలు వారికి ఎక్కువగా అందుబాటులోకి వస్తే మరింత సాధికారిక పొందినట్లు భావించగలరు. తద్వారా సామాజిక, ఆర్థికాభివృద్ధికి వారెంతో మెరుగ్గా తోడ్పడగలరు.

**అ**నేక దేశాలు శతాబ్ది అభివృద్ధి లక్ష్యాల (MDG) మార్గదర్శకాల పరిధిలో 2015 దాకా స్వయంగా, సామూహికంగా మహిళా సాధికారిక వైపు ముందడుగు వేశాయి. ఈ సందర్భంగా దిగువ పేర్కొన్న కొన్ని విశ్వవ్యాప్త గణాంకాలను పరిశీలించండి:-

- **ఆరోగ్యం** –1990తో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా ప్రసూతి మరణాలు 45 శాతం తగ్గాయి.
- **విద్య** – ప్రాథమిక విద్యకు సంబంధించి ప్రపంచంలోని అన్ని వర్ధమాన ప్రాంతాలూ బాలబాలికలకు సమానావకాశాలను అందుబాటులో ఉంచడంలో దాదాపు సఫలమయ్యాయి.
- **రాజకీయాలు** – 1995–2015 మధ్య ప్రపంచవ్యాప్తంగా జాతీయ చట్టసభలలో మహిళల శాతం సుమారు రెట్టింపైంది.
- **వ్యాపార నిర్వహణ** – ఫార్చ్యూన్ 500 జాబితాలోని కంపెనీల ముఖ్య కార్యనిర్వహణాధికారుల (CEO) లో 1999 నాటికి ఒక్కరు మాత్రమే మహిళకాగా, 2015 నాటికి 25 మంది మహిళలు సీఈవోలయ్యారు.
- **పరిశ్రమల స్థాపన** – తూర్పు ఆసియాలో అధికారికంగా సుమారు 60 లక్షల చిన్న వ్యాపారాలు మహిళల యాజమాన్యంలో ఉన్నాయి. ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్, వియత్నాంవంటి ఆర్థిక వ్యవస్థలలో మహిళల నిర్వహణలోని వ్యాపారాల సంఖ్య వేగంగా పెరుగుతూ వస్తోంది.

**అయినప్పటికీ మహిళలపట్ల వివక్ష మాత్రం ఇంకా మిగిలే ఉంది:**

- **ఆరోగ్యం** – వారించదగిన గర్భధారణ సంబంధ కారణాలతో నిత్యం 800 మంది మహిళలు మరణిస్తుండగా 99 శాతం మరణాలు వర్ధమాన దేశాల్లోనే సంభవిస్తున్నాయి.
- **నీరు** – సహారా ఎడారికి దక్షిణ ప్రాంతంలోని 25 దేశాలలో నీరు తెచ్చుకోవడం కోసం మహిళలు రోజుకు 1.6 కోట్ల గంటలు గడపాల్సి వస్తుండగా పురుషులు 60 లక్షల గంటలు గడుపుతున్నారు.
- **విద్య** – ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో ప్రాథమిక విద్యపరంగా లైంగిక సమానత సాధించినా, ద్వితీయ, తృతీయ స్థాయిలకు వచ్చేసరికి ఆ వ్యత్యాసం విస్తృతమవుతోంది. ఐక్యరాజ్యసమితిలోని ఆసియా, పసిఫిక్ సామాజిక– ఆర్థిక కమిషన్ (ESCAP) పేర్కొన్న ప్రకారం... బాలికలు ప్రాథమికస్థాయి నుంచి తృతీయస్థాయిదాకా సగటున 12.3 సంవత్సరాల పాటు విద్యావకాశాలు పొందుతుండగా, బాలురు 12.4 సంవత్సరాల పాటు విద్యావకాశాలు పొందుతున్నారు.
- **రాజకీయాలు** – అన్ని దేశాలలోనూ జాతీయ చట్టసభల స్థాయిలో మహిళా ప్రజా ప్రతినిధులు కేవలం 22 శాతమే.

- **వ్యాపార నిర్వహణ –** ఫార్చ్యూన్ 500 జాబితాలోని కంపెనీల ముఖ్య కార్యనిర్వహణాధికారులలో 2015 నాటికి మహిళల సంఖ్య పెరిగినా ఆ పెరుగుదల కేవలం 5 శాతమే.
- **ఉపాధి –** ప్రపంచంలో పనిచేయగల (15 ఏళ్లు అంతకుమించి) వయసులో ఉన్న పురుషుల్లో 75 శాతం, మహిళల్లో 50 శాతం కార్మికశక్తిలో భాగంగా ఉన్నారు. కాగా, విశ్వవ్యాప్తంగా పనిచేయగల మహిళల్లో 50.5 శాతం ప్రమాదకర పనుల్లో ఉండటం గమనార్హం. అంతేగాక పురుషులతో పోలిస్తే మహిళల సంపాదన 24 డాలర్ల మేర తక్కువ.
- **పరిశ్రమల స్థాపన –** ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో 48 శాతం పారిశ్రామికులు. కానీ, వాటిలో అధికశాతం చిన్న, అనధికార లేదా బతుకుతెరువు వ్యాపారాలే తప్ప వృద్ధితో ముడిపడినవి కావు. పురుషులతో పోలిస్తే మహిళలకు ఉత్పాదక వనరులు పరిమితంగా అందుబాటులో ఉండటమే ఇందుకు మరో కారణం.
- **భూమి/బ్యాంకు ఖాతా –** భూ యజమానులలో మహిళలు 20 శాతంకన్నా తక్కువ కాగా, దక్షిణాసియాలో సొంత బ్యాంకు ఖాతా కలిగిన మహిళలు 37 శాతమే.

**పైన ఇచ్చిన గణాంకాలన్నీ మహిళా సాధికారికలో అంతర్భాగమైన అంశాలకు సంబంధించినవి.**

- **జ్ఞానాత్మకం** – సమాజంలో తన పరాధీనత సంబంధిత పరిస్థితులు, దానికి కారణాలపై మహిళకుగల అవగాహన
- **మానసికం** – తన పరిస్థితిని మార్చుకోగలిగేలా వ్యవహరించగలనన్న విశ్వాసం, భావనలు
- **రాజకీయం** – మార్పు దిశగా ఒక మహిళకుగల నిర్వహణ, సమీకరణ సామర్థ్యం
- **ఆర్థికం** – ఓ మోస్తరు స్వయంప్రతిపత్తికి అవకాశం లభించే ఉత్పాదక కార్యాచరణలో నిమగ్నం కాగల సామర్థ్యం

## నిదర్శనాధ్యయనం 1:

### ఓ దక్షిణాసియా మహిళ



*"నేను ఒక గ్రామంలో పెరిగాను. ఆరేళ్ళ వయసులో బడికి వెళ్లడం ప్రారంభించాను. కానీ, వంటపని, ఇల్లు శుభ్రం చేయడంలో అమ్మకు సహాయపడాల్సి ఉండేది. అందువల్ల బడిలో ఇచ్చిన ఇంటిపని చేయడానికి సమయం ఉండేది కాదు. మా గ్రామంలో కరవొచ్చినప్పుడు మంచినీళు తెచ్చుకోవడంలో మా అమ్మకు సహాయపడాల్సిన కారణంగా బడికి వెళ్లడం మానేశాను. నాకు మిగిలిన ఒకేఒక్క ఆశ నన్ను సంరక్షించగల పురుషుణ్ని పెళ్లి చేసుకోవడమే. అలా 15 ఏళ్ల వయసులోనే పెళ్లయింది. నాకిప్పుడు 30 ఏళు ... ఐదుగురు పిల్లల తల్లిని. మాకు తిండీ, బట్టా సమకూర్చడానికి నా భర్త పొలంలో ఎంతో కష్టం చేస్తాడు. ఆయనకు సహాయంగా నేనూ కొంత అదనంగా సంపాదించాలన్నది నా ఆలోచన. బాతులు/ కోళ్ల పెంపకం, గుడ్లు అమ్మడం వంటి పని ఏదైనా చేయాలని ఉంది. కానీ, నాకు అప్పు దొరకలేదు. పట్టణంలోని ఫ్యాక్టరీలో ఏదైనా పని దొరుకుతుందిగానీ, అలా నిత్యం ఎంతో దూరం వెళ్లివచ్చే సమయంలో మహిళలు అత్యాచారానికి గురవుతారెమోనని భయం. ధనవంతురాలి ఇంట్లో వారి పిల్లల సంరక్షణ చూసుకుంటూ వారి ఇంట్లోనే ఉండొచ్చు. అయితే, దీనివల్ల ఆశించిన సంపాదన ఉండకపోయినా సురక్షితం అనవచ్చు... కానీ, నా పిల్లల్ని ఎవరు చూసుకుంటారు?"*

**ఈ** ఉదాహరణ కల్పితమేగానీ, దక్షిణాసియాలోని ఒక మహిళ జీవిత చిత్రాన్ని ఇది కళ్లకు కడుతుంది. ఆమె గ్రామీణ మహిళ, విద్యాభ్యాసం పూర్తిచేయలేని నిస్సహాయురాలు. ఆమెకు చాలామంది పిల్లలు, వాళ్ల సంరక్షణతో పాటు ఎలాంటి అదనపు ఆదాయానికి తావులేని ఇంటి బాధ్యతలున్నాయి. ఫలితంగా ఆమె ఆర్థిక కార్యకలాపాల్లో పూర్తి భాగస్వామి కావడం వీలుకాదు. ఇలాంటి అన్యాయపు సమాజ ఆదరణ గురించి అవగాహన పెంచడంలో విద్య తనవంతు పాత్ర పోషించగలదు. అలాగే దానివల్ల సమకూడే నైపుణ్యం, అనుభవం తదనుగుణంగా స్పందించేలా మానసిక ఉత్తేజమిస్తాయి. అలాంటి ఆదర్శప్రాయ మహిళల గురించి ఒక మహిళకు తెలిసినా, సామాజిక మద్దతున్నా ఆమె తన జీవితంపై మరింత సాధికారిక లభించినట్లు భావించగలదు. ఆమె/అతడు తమకోసం తామే కార్యాచరణకు ఉపక్రమించగల సామర్థ్యం సంతరించుకోవడమే ఈ సందర్భంగా ఆశిస్తున్న ఫలితం.

**లిం**గ సమానత్వం, సాధికారిక ప్రతి మహిళకూగల హక్కులు. వ్యక్తిగత స్థాయిలో సాధికారిక అంటే– ఆమె జీవితంలో లభించాల్సిన అవకాశాలన్నీ ఆమెకు అందుబాటులోకి రావడమే. తన గళం వినిపించగల, ప్రజాస్వామ్య వ్యవస్థ పరిధిలోని రాజకీయ ప్రక్రియలో భాగస్వామి కాగల, విధాన రూపకల్పన–అమలులో చురుగ్గా పాలుపంచుకోగల అవకాశం ఆమెకుంటుంది. నిజమైన సాధికారిక మహిళలకు కార్యసాధకతను, తమ జీవితంపై తామే నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యాన్ని కల్పిస్తుంది. ఆశించిన ఫలితాల సాధనలో ఎలాంటి ప్రభావాలు, భయాలు లేకుండా పనిచేసుకునే వీలు కల్పిస్తుంది. వ్యక్తిగత స్థాయిలో మహిళలకు ఇదెంతో కీలకం. సామాజిక వ్యవస్థాపరమైన ప్రతికూలతలను మహిళ అధిగమించడంలో కార్యసాధకత్వం చోదకంగా పనిచేస్తుంది. తాను చేయదలచే వ్యాపారం లేదా పని గురించి నిర్ణయం తీసుకోగల శక్తినిస్తుంది. అంతేకాదు... పెళ్లి చేసుకోవాలా / వద్దా, ఎందరు పిల్లలను కనాలి, రాజకీయాల్లో చురుగ్గా ఉండాలా / వద్దా తదితర విషయాల్లో నిర్ణయాధికారం ఉంటుంది.

ప్రభావవంతమైన సాధికారికతో మహిళల జీవితాల్లో అనేక సానుకూల ప్రభావాలుంటాయి. అప్పుడు మహిళలు:–

- హింస నుంచి విముక్తులవుతారు
- లైంగిక, పునరుత్పత్తి హక్కులపై నియంత్రణ కలిగి ఉంటారు
- తమ గళాన్ని గట్టిగా వినిపించగలరు
- సామాజిక, ఆర్థిక చలనశీలత కలిగి ఉంటారు
- ఆర్థిక ఆస్తుల యాజమాన్యం, నియంత్రణ సామర్థ్యం సంతరించుకుంటారు
- తమ సొంత ఆదాయంపై తామే నియంత్రణ కలిగి ఉంటారు

**మ**హిళలకు ఉపాధిద్వారా సాధికారిక సిద్ధిస్తే సాధారణంగా కుటుంబం పరిమితంగా, మరింత పోషకంగా, మెరుగైన విద్యా ప్రమాణాలు కలిగి ఉంటుందని ఈ పరిశోధన స్పష్టం చేస్తోంది. మహిళల్లో అక్షరాస్యత శాతం అధికంగా ఉంటే సంతానోత్పత్తి శాతం తగ్గి వర్ధమాన దేశాల్లో శిశు మరణాల శాతం కూడా తగ్గుతుందని తేలింది. విద్యావంతురాలైన మహిళకు స్థానిక, అంతర్జాతీయ కార్మికశక్తిలో భాగమయ్యే అవకాశం లభిస్తుందని, అది ఆమెతో పాటు సమాజం మొత్తం అభివృద్ధికి దోహదం చేస్తుందని విశదమైంది.

## నిదర్శనాధ్యయనం 2:

### స్థానిక రైతుల, గ్రామీణ మహిళల ఆదాయాన్ని అటెఫీ ఎలా పెంచగలిగారు!

*"**మాది** ఆఫ్ఘనిస్థాన్. నా పేరు అటెఫీ మన్సూరీ.. వయసు 52. అబ్దుల్లా ముస్లిం కంపెనీ డైరెక్టర్‌ను. మా సంస్థ కుంకుమ పువ్వును శుద్ధిచేసి, విదేశాలకు ఎగుమతి చేస్తూంటుంది. ఒక మహిళగా నేను ఈ వ్యాపారాన్ని నిర్వహించగలనని తొలినాళ్లలో రైతులు ఊహించనే లేదు. ఇలాంటివి మహిళలు చేసే పనులు కావు కాబట్టి నేను కుంకుమ పువ్వు ఎగుమతి ప్రారంభించాక రైతులు, ఉత్పత్తిదారులు కుంకుమ పువ్వు సరఫరాకు అంగీకరించలేదు. ఒక మహిళకు ఈ వ్యాపారం చేయగల శక్తిసామర్థ్యాలు లేవని వారు భావించడమే ఇందుకు కారణం.*

*ఆ తర్వాత నా భర్తతోపాటు మా కుటుంబంలోని పురుష సభ్యులతో కలసి కుంకుమ పువ్వు ఉత్పత్తిదారులతో నేను సమావేశమయ్యాను. నాకున్న పరిజ్ఞానం, అనుభవం, వ్యాపార సామర్థ్యం గురించి వారికి వివరించాను. నాపై నమ్మకం ఉంచినవారికి ఎలాంటి నష్టం వాటిల్లబోదని భరోసా ఇచ్చాను. అలా చాలాసార్లు చర్చలు సాగిన తర్వాత ఈ వ్యాపారంలో నా సామర్థ్యాన్ని పరీక్షించడం కోసం ఒకరిద్దరు రైతులు నాతో చేయి కలిపేందుకు అంగీకరించారు.*

*నాతో కలసి పనిచేసేందుకు మహిళలను కూడా ఒప్పించాల్సి వచ్చింది. మా గ్రామంలో మహిళలు ఇల్లుదాటి పనిచేసే ఆనవాయితీ లేదు. అయితే, 'మీ భార్యలు, కుమార్తెలు డబ్బు సంపాదించి కుటుంబ ఆదాయాన్ని పెంచుతారు. వారు పనిచేసే చోట అందరూ మహిళలే ఉంటారు' అని వారి భర్తలకు, కుటుంబసభ్యులకు వివరించాను. అలా అనేకసార్లు ప్రతి కుటుంబంతో సంభాషించాక ముందుకొచ్చిన మహిళల్లో ఇప్పుడు అధికశాతం వ్యాపారం చేస్తుండగా కొందరు సొంత కంపెనీలనే నడుపుతున్నారు'. మతఛాందస తీవ్రవాదులు చంపేస్తామని బెదిరించినా ముందడుగు పడింది. మహిళలపై హింసను నిర్మూలించగలిగేది ఆర్థిక స్వేచ్ఛ, సాధికారిక మాత్రమేనని నాకు తెలుసు. అందుకే అనేక సవాళ్లు ఎదురైనా నా ప్రయత్నాన్ని ఎన్నడూ విరమించలేదు. ఆ మేరకు నేర్చుకోవడం, పని చేయడం, ఆర్జించడంలో మహిళలకు సహాయపడటం కోసం మరింతగా శ్రమించాను, ఘర్షణపడ్డాను. చివరకు నా శ్రమ ఫలించింది."*

**ఆ**ర్థిక వృద్ధికి మహిళలు శక్తివంతమైన చోదకులు. జాతీయ ఆర్థిక వ్యవస్థలో మహిళలను ప్రభావవంతంగా నియోగిస్తే ఆయా దేశాలలో సానుకూల సామాజిక-ఆర్థిక ప్రభావాలుంటాయి. ఉదాహరణకు పురుష, మహిళా కార్మికశక్తిలో వ్యత్యాసాన్ని తగ్గిస్తే దేశీయ స్థూలోత్పత్తి (GDP) అనేకరెట్లు పెరుగుతుంది. ఆ మేరకు లింగపరంగా సమతూకంగల కార్మికశక్తివల్ల అమెరికాలో 5%, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో 12%, ఈజిప్టులో 34%, జపాన్‌లో 9% వంతున జీడీపీలో అదనపు వృద్ధి నమోదు కాగలదు. మహిళలతో కూడిన సమ్మిళిత కార్మికశక్తితో మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికాలలోని కుటుంబాల సగటు ఆదాయం 25% మేర పెరుగుతుందని అంచనా. ఇక ప్రపంచంలో అధికశాతం మహిళలు ఎలాంటి ప్రతిఫలం లేని పనులలో ఉన్నారు. అందువల్ల మహిళా సాధికారికను ప్రోత్సహించే ఏ విధానమైనా కుటుంబ బాధ్యతలతో ముడిపడిన ఇంటిపనుల కీలక భాగస్వామ్యాన్ని

కూడా పరిగణనలోకి తీసుకోవడం అవశ్యం. అలాగైతేనే వారి సంపూర్ణ సహకారానికి పరిహారంతోపాటు గుర్తింపునకు భరోసా ఇవ్వగలం. ఆదాయసృష్టి కార్యకలాపాల్లో మహిళల భాగస్వామ్యం తగ్గితే ఆర్థికాభివృద్ధి నష్టం తలసరి జీడీపీలో 30%దాకా ఉంటుంది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో మహిళలను కార్మికశక్తిలో చేరనీయకుండా అడ్డుపడటంవల్ల ఏటా 8900 కోట్ల డాలర్ల మేర నష్టం వాటిల్లుతున్నదని అంచనాలు పేర్కొంటున్నాయి.

**ఇలా చేయండి:**

వ్యక్తిగతంగా లేదా మిత్రులతో కలసి కింది సమస్యలను పరిశీలించండి:

- **స్థానిక, జాతీయ స్థాయిలలో ఏయే రంగాలలో మీ దేశ మహిళలు చక్కగా పనిచేస్తున్నారు? ఏయే రంగాలలో వెనుకబడ్డారు?**
- **ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (UNDP)లోని లైంగిక అసమానత సూచీలో మీ దేశం ఏ స్థానంలో ఉంది?**
- **మెరుగుదలకు అవకాశాలేమైనా ఉన్నాయా? ఉంటే... ఎలా?**

## 2.2 మహిళా సాధికారిక - సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు

**ప**ర్యావరణ, సామాజిక-ఆర్థిక కోణాల్లో సమతూకానికి ఉద్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ప్రపంచానికంతటికీ వర్తిస్తాయి. ఆకలి, దారిద్ర్య నిర్మూలనతోపాటు అందరికీ నీరు, ప్రాథమిక విద్య, శిశు మరణాల నియంత్రణ వంటి అనేక ముఖ్యమైన కార్యక్రమాలతో 15 ఏళ్లపాటు అమలు చేసిన శతాబ్ది అభివృద్ధి లక్ష్యాల (MDG) స్థానంలో ఎస్డీజీలను ప్రవేశపెట్టారు. అయినప్పటికీ వివిధ రంగాలలో వ్యత్యాసాలు అలాగే ఉన్నాయి. ఉదాహరణకు... ఆదాయ సంబంధ పేదరికం తగ్గింపు ఎంతోకొంత సాధ్యమైనా అసమానతల తగ్గింపునకు అది దారితీయలేదు. ప్రపంచ లింగ వ్యత్యాస నివేదిక-2015 ప్రకారం... 2006 నుంచి అదనంగా 25 కోట్ల మంది మహిళలు కార్మికశక్తిలో భాగమయ్యారు. అయితే, నేడు వారి వార్షిక వేతనం పదేళ్లకిందటి పురుషుల ఆర్జనతో సమానంగా మాత్రమే ఉంది. ఒక్కరు కూడా వెనుకబడరాదన్న ధ్యేయంతో మరింత సమ్మిళిత సుస్థిర అభివృద్ధి, పేదరిక సమస్యల పరిష్కారం దిశగా ఎస్డీజీల పోరు కొనసాగుతోంది.

**చ**ట్టాలు, సామాజిక-సాంస్కృతిక నిబంధనలు, ఆర్థిక-రాజకీయ విధానాలు తదితరాలలో అనేక మార్పులు రావాల్సినందున లింగ సమానత్వం, సాధికారికపై అంకితభావంతో దృష్టి సారించాల్సి ఉంది. ఆయా దేశాల్లో కార్యాచరణకు మార్గదర్శకత్వం వహించడమే లక్ష్య నిర్దేశంలోని ఆంతర్యం. తద్వారా 2030నాటికల్లా మహిళా సాధికారిక, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించే ఆరంభ చర్యలుగా ఇవి ఉంటాయి. అదే సమయంలో సుస్థిర లక్ష్యాలపై ప్రపంచ దేశాల ఒప్పందం అన్ని లక్ష్యాలకూ వర్తించే సూత్రంగా అంగీకారం కుదిరింది. అందువల్ల మహిళా సాధికారతను ఒక ప్రధానోద్దేశంగానేకాక మొత్తం పరిష్కార ప్రణాళికలో కీలకపాత్ర గలదిగా భావిస్తున్నారు.

## సుస్థిర అభివృద్ధి లక్ష్యం 5 - లింగ సమానత్వ సాధన... మహిళలు, బాలికలందరికీ సాధికారిక కల్పన

**సు**స్థిర అభివృద్ధి లక్ష్యం 5 ప్రధానంగా లింగ సమానత్వ సాధనలో ఎదురయ్యే లింగపరమైన సమస్యలపైనా, మహిళా సాధికారికమీదా దృష్టి సారించింది. దీనికి సంబంధించిన కీలక లక్ష్యాలు కిందివిధంగా ఉన్నాయి:

**5.1** మహిళలు ప్రతి చోటా ఎదుర్కొంటున్న అన్ని రూపాల్లోని వివక్షను అంతం చేయడం

**5.2** మహిళలు, బాలికలపై ప్రభుత్వ, ప్రైవేటు పరిధులలో అక్రమ రవాణా, లైంగిక-తదితర దోపిడీసహా అన్ని రూపాల్లోని హింసను నిర్మూలించడం

**5.3** బాల్య, తరుణ, బలవంతపు వివాహాలు, స్త్రీ జననాంగ విచ్ఛేదం వంటి అన్ని హానికర దురాచారాలను నిర్మూలించడం

**5.4** మహిళలు చేసే ఎలాంటి ప్రతిఫలంలేని కుటుంబ సంరక్షణ, ఇంటిపనులవంటి బాధ్యతలను గుర్తించి ప్రభుత్వ సేవలు, మౌలిక సదుపాయాలు, సామాజిక రక్షణ విధానాలు, ఇంటిపనుల్లో కుటుంబమంతా భాగం పంచుకోవడంవంటి చర్యలద్వారా జాతీయస్థాయిలో తగువిధంగా విలువ కట్టడం

**5.5** రాజకీయ, ఆర్థిక, ప్రజా జీవితంలోని అన్నిస్థాయిల నిర్ణయాత్మకతలో మహిళల పూర్తి, ప్రభావవంతమైన భాగస్వామ్యం, సమాన అవకాశాలకు భరోసా ఇవ్వడం

**5.6** దాంపత్యం, పునరుత్పత్తి ఆరోగ్యం, పునరుత్పత్తి హక్కులకు సార్వత్రిక భరోసా ఇవ్వడం; జనాభా – అభివృద్ధిపై కార్యాచరణ ప్రణాళిక కోసం అంతర్జాతీయ సదస్సు నిర్దేశాల ప్రకారం, బీజింగ్ కార్యాచరణ వేదికల చర్చానంతరం రూపొందించిన పత్రాలు, సమీక్ష సదస్సుల తీర్మానాలకు అనుగుణంగా ఇది సాకారం కావాలి

**5.7** ఆర్థిక వనరులపై మహిళలకు సమాన హక్కుల కోసం సంస్కరణలు తేవడం; భూమి తదితర రూపాల్లోని ఆస్తి, ఆర్థిక సేవలు, వారసత్వం, సహజ వనరులు తదితరాలపై జాతీయ చట్టాల మేరకు యాజమాన్య, నియంత్రణ హక్కు సంక్రమింపజేయడం

**5.8** సహాయక సాంకేతికత వినియోగం పెంచడం, ప్రత్యేకించి మహిళా సాధికారికను ప్రోత్సహించేందుకు సమాచార, సందేశ సాంకేతికత (ఐసీటీ)ల పరిజ్ఞాన విస్తృత వినియోగం

**5.9** లింగ సమానత్వంతోపాటు మహిళలు, బాలికలందరికీ అన్ని స్థాయులలో సాధికారిక కల్పన కోసం పటిష్ఠ విధానాల బలోపేతం, అనుసరణ, అమలుకు తగిన చట్టాలు చేయడం

### ఇలా చేయండి:

వ్యక్తిగతంగా లేదా మిత్రులతో కలిసి కింది సమస్యలను పరిశీలించండి:

- శతాబ్ది అభివృద్ధి లక్ష్యాలను సాకారం చేయడంలో మీ దేశం పనితీరు ఎలా ఉంది? (http://mdgs.un.org/unsd/mdg/default.aspx)
- సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో మీ దేశానికి ఎదురయ్యే కొన్ని సవాళ్లు, కీలక అవకాశాలను నమోదు చేయండి ఎస్‌డీజీ 5 సాధన కోసం మీ దేశంలో దృష్టి సారించాల్సిన అంశాలను గుర్తించండి

## 2.3 మహిళా సాధికారిక కోసం ఐసీటీ

**మ**హిళా సాధికారికను ప్రోత్సహించేందుకు ఐసీటీ వినియోగం ప్రధానమంటున్న ఎస్‌డీజీ 5 నిర్దేశిత కీలక లక్ష్యాలలో ఒకదాన్ని మనం గమనించాం. లింగ సమానత్వం, సాధికారికను సాకారం చేయడంలో ఐసీటీకి కీలక పాత్ర ఉందన్నది వాస్తవం. ఐసీటీ అందుబాటులో ఉంటే సామాజిక, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో మహిళలకు తమ గళం వినిపించగల సాధికారిక లభించినట్టే. స్వీయ కార్యసాధకత, తమకంటూ ఓ స్థానం సృష్టించుకునేందుకు ఐసీటీ వారికి దోహదపడుతుంది. తమ ఎంపికకు అనుగుణంగా వృత్తిపరమైన రాణింపునకు, సమాజంలో హోదా మెరుగుకు తోడ్పడుతుంది. ఎస్‌డీజీ 5 సాకారానికేగాక ఇతర ఎస్‌డీజీ లక్ష్యాల సాధనకూ ఐసీటీ కీలక సహాయకారిగా ఉపయోగపడుతుంది.

## నిదర్శనాధ్యయనం 3:

### మహిళలకు డిజిటల్ పరిజ్ఞాన కల్పన ప్రచార కార్యక్రమం

**ఈ కార్యక్రమంద్వారా మహిళలకు ఐసీటీలో ప్రాథమిక శిక్షణ ఇస్తారు. కంప్యూటర్‌తో పనిచేయడం ఎలా? ఈ-మెయిల్ పంపడం, కుటుంబసభ్యులు-స్నేహితులతో ఆన్‌లైన్ అను సంధానం వంటివాటిపై ఇది అవగాహన కల్పిస్తుంది. అంతర్జాతీయ టెలి కమ్యూనికేషన్ సమాఖ్య (ITU), టెలిసెంటర్.ఓఆర్‌జీ ఫౌండేషన్ దీన్ని సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ప్రపంచంలో ఇప్పటికే ఎలాంటి నైపుణ్యంలేని 10 లక్షల మందికిపైగా మహిళలకు ఇవి శిక్షణనిచ్చాయి. డిజిటల్ పరిజ్ఞానం లేక అనేక దేశాల్లో మహిళల వ్యక్తిగత ఎదుగుదల అణగారిపోతూ వారు పూర్తి సామర్థ్యం ప్రదర్శించలేని పరిస్థితులున్నాయని ఈ కార్యక్రమం గుర్తించింది. ప్రస్తుతం సుమారు 20వేల శిక్షణ కేంద్రాల్లో మహిళలు ఎందులోకి వెళ్లినా ఐసీటీ వినియోగంపై ప్రాథమిక పరిజ్ఞానంతో తిరిగి రావచ్చు. సమాచార అన్వేషణ, మద్దతు సమూహాలతో అనుసంధాన నైపుణ్యం అందిరావడంతో వారు తమ జీవనోపాధిని మెరుగుపరచుకోగలరు. హస్తకళలు, వ్యవసాయ - పర్యాటకం, వ్యవసాయం తదితర అనేక ఆర్థిక కార్యకలాపాలలో మద్దతుకు ఐసీటీ వినియోగం ఎలాగో తెలిపే శిక్షణ సరంజామా ఈ కేంద్రాలలో ఉంది. లైంగికత, పేదరికం, వైకల్యంవంటి ప్రతికూలతలను ఎదుర్కొంటున్న కొందరు మహిళలకు శిక్షణ కేంద్రం శిక్షకులుగానూ శిక్షణ ఇస్తున్నారు. ఈ సామర్థ్యాలన్నీ మహిళా సాధికారికకు దోహదం చేస్తాయి. ప్రతి కేంద్రంలో కనీసం ఇలాంటి 50 మందికి సహాయపడాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కృషితో ప్రపంచంలో నేడు 10 లక్షల మందికిపైగా మహిళలు డిజిటల్ అంతరాన్ని పాక్షికంగా అధిగమించగలిగారు.**

### మిమ్మల్ని మీరే పరీక్షించుకోండి

- సాధికారిక అంటే ఏమిటి?
- అభివృద్ధిలో స్త్రీపురుషులిద్దరూ ఎందుకు పాలుపంచుకోవాలి?
- సాధికారికను ప్రోత్సహించడానికి ఐసీటీ ఎలా దోహదపడుతుంది?
- సాధికారికను ప్రోత్సహించడం కోసం ఐసీటీ వినియోగానికి సంబంధించిన ఇటీవలి చర్యల గురించి మీకుతెలుసా?

## కీలక సందేశాలు

- **మహిళా సాధికారిక అంటే మహిళలు తమ జీవితాలను తామే నియంత్రణలోకి తీసుకోగల సామర్థ్యం పొందే ప్రక్రియ**
- **సార్వజనీనత సూత్రం మేరకు ఎస్‌డీజీలు మహిళా సాధికారికను ప్రోత్సహిస్తాయి. దాంతో అభివృద్ధిలో ప్రతి ఒక్కరికీ భాగం ఉందన్న భరోసా లభిస్తుంది. లింగ సమానత్వం, మహిళా సాధికారికలకు ప్రోత్సాహంపై ఎస్‌డీజీ 5 ప్రత్యేక దృష్టి సారిస్తుంది.**
- **సాధికారికపై అవగాహనను పెంచి, అక్షరాస్యత-విద్యవైపు నడపడంద్వారా ఐసీటీలు మహిళా సాధికారికను సాకారం చేయగలవు. అలాగే చర్చకు వేదికగా నిలుస్తూ అమ్మకందారులను విపణితో అను సంధానించగలవు.**

# 3 మహిళా సాధికారికకు అవరోధాలు - సహాయకారకాలు

**మ**హిళా సాధికారికకు అనేక అవరోధాలతోపాటు సహాయకారకాలు కూడా ఉన్నాయి. ఇవేమిటో అర్థం చేసుకోవడం ఒక ముఖ్యమైన ముందడుగు. తద్వారా అవరోధాలను అధిగమించి, సహయకారకాలను ప్రోత్సహించవచ్చు. మహిళా సాధికారికను వెనక్కు నెడుతున్న, సహాయ కారకాలుగా ఉన్న అనేక ప్రధానాంశాలను కింద పేర్కొన్న ఉప విభాగాలు వివరిస్తాయి.

## 3.1 అవరోధాలు

### 3.1.1 వివక్షపూరిత సామాజిక నియమాలు - సంస్కృతి

**మ**హిళా సాధికారికకుగల అనేక అవరోధాలలో అధికశాతం సామాజిక-సాంస్కృతిక సంప్రదాయాలతో ముడిపడినవే. స్త్రీపురుషులకు నిర్ణీత పాత్రలను అవి నిర్దేశిస్తున్నాయి. విభిన్న వివక్షపూరిత సామాజిక - సాంస్కృతిక నియమాలు, ఆచారాలు సాధారణంగా మహిళలకు హద్దులు పెడుతుంటాయి. వారి కదలికలను, చర్యలను, అవకాశాలను పరిమిత పరిధికి కుదిస్తాయి. మహిళల నిత్య నిర్ణయాత్మకత మార్గాలు వివిధ కోణాల్లో సమాజ నియంత్రణకు పరిమితమవుతాయి. అటువంటి వాటిలో స్త్రీల విద్యాస్థాయి, వారు వెళ్లదగిన ప్రదేశాలు, వారెలా పనిచేయాలి, ఏయే సామాజిక సమూహాలతో సంబంధాలు కలిగి ఉండాలి.. తదితర అంశాలపై నిర్ణయాలను నియంత్రించడం కూడా ఇందులో భాగంగా ఉంటాయి. సంప్రదాయక చట్టాలు-నిబంధనలు, వ్యవస్థాగత నిర్మాణం, సంబంధిత సంస్థాగత ప్రవర్తన, దృక్పథం కూడా ఈ చర్యలలో తమ పాత్రను పోషిస్తాయి.

**స**మాజంలో మహిళల స్థితిగతులు కొన్ని సామాజిక- ఆర్థిక కట్టుబాట్లపై ఆధారపడి ఉంటాయి. వాటిలో అనేకం (ఉదా॥ ఆస్తి హక్కు, కుటుంబ సమస్యలపై నిర్ణయాధికారం, విద్య, పిల్లల సంరక్షణ, ఉపాధి వగైరా...) తరచూ పునరావృతం అవుతుంటాయి. మహిళలు, పురుషుల భవిష్యత్తును నిర్ణయించడంలో, నిర్దేశిత జనబాహుళ్యంపై

సామాజిక దృక్పథంలో, సేవలకు పరిహార చెల్లింపు స్థాయిలో సామాజిక నియమాలు పెను ప్రభావం చూపుతాయి. వృత్తిపరమైన రంగాలలో చురుగ్గా పాల్గొనగల, ప్రతిస్పందనలు స్వీకరించగల మహిళల సామర్థ్యాన్ని ఇటువంటి ధోరణులు దెబ్బతీస్తాయి.

**సా**ధికారికకు మరో ముఖ్యమైన అంశం రాజకీయ భాగస్వామ్యం. రాజకీయ కార్యకలాపాల్లో ప్రాతినిధ్యం, భాగస్వామ్యం స్వల్పమే అయినందువల్ల తమ అవసరాలు, సమస్యల పరిష్కారంపై మహిళా గళానికిగల అవకాశం తగ్గుతుంది. నిర్ణయాత్మక వ్యవస్థలలో మహిళలకు తగిన ప్రాతినిధ్యం లభిస్తేనే వారి అవసరాలు తీరడానికి, గళం వినిపించేందుకు వీలవుతుంది. లేకపోతే ఆర్థిక కార్యకలాపాలపై నిర్ణయాల్లో వారి అవసరాలకు చోటు లభిస్తుంది తప్ప వాటి నిర్దిష్ట పరిష్కారానికి ప్రాధాన్యం లభించదు.


**ప్ర**పంచవ్యాప్తంగా ప్రజాప్రతినిధి స్థానాలకు ఎన్నికవుతున్న మహిళల నిష్పత్తి పెరుగుతోంది. వాస్తవానికి 1997లో ఇటువంటి భాగస్వామ్యం రెట్టింపైంది. కానీ, రాజకీయ రంగంలో లింగ సమానత్వానికి ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. వివిధ దేశాల్లో 2015 ఆగస్టునాటికి జాతీయస్థాయి చట్టసభల ప్రజా ప్రతినిధుల్లో మహిళలు కేవలం 22 శాతమే. వీరిలో 11 మంది దేశాధినేతలుగా ఉంటే, 10 మంది ప్రభుత్వాధినేతలుగా ఉన్నారు. ఆసియా –పసిఫిక్ ప్రాంతంలో ఈ సంఖ్య ప్రపంచ సగటుకన్నా చాలా తక్కువ. ఆసియా దేశాల్లోని జాతీయ చట్టసభ సభ్యులలో మహిళలు సగటున 18.4 శాతం మాత్రమే. ఇక పసిఫిక్ ప్రాంతంలో ఇది ఇంకా తక్కువ (15.7 శాతం)గా ఉంది. ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం పేర్కొంటున్న ప్రకారం... **"ప్రపంచవ్యాప్తంగా ఒకటి లేదా రెండు సభలతో కూడిన పార్లమెంట్లున్న 37 దేశాల్లో మహిళా ప్రతినిధుల సంఖ్య 10 శాతంకన్నా తక్కువ. ఇక 2015 ఆగస్టునాటికి ఈ జాబితాలోని ఆరు దేశాల్లో ఒక్క మహిళ కూడా లేరు."** మహిళా సాధికారికపై ప్రపంచబ్యాంకు నివేదిక ఇలా పేర్కొంటోంది. **"మహిళలు పార్లమెంటులో ప్రవేశించగలిగినా వారికి మంత్రి పదవి లభించే అవకాశాలు చాలా తక్కువ... ఒకవేళ లభించినా సామాజిక శాఖలకు మాత్రమే పరిమితం. అందుకే వారు ఉన్నతస్థాయి అధికారిక పదవులు నిర్వహించడం అరుదు."**

**కా**ర్మికశక్తి భాగస్వామ్యపరంగా చూస్తే... పనిచేయగల వయసులో ఉన్న మహిళలు సామాజిక, రాజకీయ, చట్టపరమైన కారణాలవల్ల, ప్రవేశంతో ముడిపడిన అధికశాతం దూరంగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో 2015 గణాంకాల ప్రకారం మొత్తం ప్రపంచ కార్మికశక్తిలో పురుషులు సుమారు 77 శాతం కాగా, మహిళలు 50 శాతం మాత్రమే. ఇక 15–49 ఏళ్ల మధ్య వయస్కులైన మహిళల్లో సగటున ప్రతి ప్రసవానికి రెండేళ్లపాటు వారు కార్మికశక్తికి దూరమవుతారు. ఎస్కాప్ వార్షిక గణాంక పుస్తకం ప్రకారం... ఆసియా – పసిఫిక్ ప్రాంతాన 2015లో స్త్రీ పురుషుల మొత్తం ఉపాధి నిష్పత్తి దాదాపు 72 శాతంగా ఉంది.

**ఈ** ప్రాంతంలోని మరింత నిర్దిష్ట సమాచారాన్ని తరచిచూస్తే మహిళల ఉపాధి స్థాయి అతి స్వల్పమేనని తేలుతుంది. అత్యధికులు (60 శాతం) సేవారంగంలో ఉపాధి పొందుతుండగా వ్యవసాయ రంగంలో 26 శాతం, పరిశ్రమల రంగంలో 12 శాతం వంతున పనిచేస్తున్నారు. ఇక స్వయం ఉపాధి ఏర్పరచుకున్నవారు లేదా ఏకవ్యక్తి యాజమాన్యం లేదా ఒకరిద్దరికి పని కల్పించేపరంగా చూస్తే ఇలాంటివారిలో మహిళలు కేవలం 2.5 శాతమే. మొత్తంమీద కొంతకాలం స్వయం ఉపాధి పనులు చేసుకుని, ఏకవ్యక్తి యాజమాన్యంగా ఉన్నవారిలో మహిళలపరంగా సగటున 17.5 శాతం పెరుగుదల కనిపిస్తుంది.

**ప్ర**పంచవ్యాప్తంగా మహిళలపట్ల కొనసాగుతున్న వేతన వివక్షవల్ల పురుషులతో పోలిస్తే వారికి 24 శాతం తక్కువగా లభిస్తోంది. అన్ని వర్గాల (అధికార్జనగల వినోదం, క్రీడలుసహా అట్టడుగునగల రోజుకూలీదాకా) ఆదాయ వనరులపరంగానూ ఇదే ధోరణి ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఉన్నత యాజమాన్య స్థాయిలోనూ, అధికార్జనగల వృత్తులలోనూ మహిళల ప్రాతినిధ్యం తగినంతగా లేకపోవడమే వేతనాల్లో ఈ అసమానతకు కారణమని చెప్పవచ్చు. వివిధ పని ప్రదేశాల్లో మహిళలు తమ శ్రమను, కాలాన్ని వెచ్చిస్తున్నా గణనీయ

**చిత్రం 1** మహిళలపై ఎలాంటి ప్రతిఫలం లేని సంరక్షణ పనుల అధిక భారం




ఆధారం: మానవాభివృద్ధి నివేదిక-2015; మానవాభివృద్ధి కోసం పని (న్యూయార్క్-2015). http://hdr.undp.org/sites/default/files/2015_human_development_report_1.pdfలో లభ్యం

ప్రతిఫలం మాట అటుంచి ఏ ఫలమూ లభించని ఉదాహరణలెన్నో ఉన్నాయి. సామాజికంగా వారి శ్రమశక్తిని తక్కువగా అంచనా వేసే ఈ ధోరణివల్ల క్రియాశీల కార్మికశక్తిలో భాగస్వాములైనప్పటికీ వారి శ్రమకు గుర్తింపు లభించడం లేదు. ఇక అసలు ఎలాంటి ప్రతిఫలం లేని ఇంటిపనితోపాటు వ్యవసాయాధారిత జీవనోపాధిలో భాగస్వామ్యం వంటివి మరికొన్ని అవరోధాలుగా నిలుస్తున్నాయి. ఎలాంటి ప్రతిఫలం లేని పనిభారం మహిళలపైనే ఎక్కువన్న వాస్తవం దిగువనున్న **చిత్రం 1** లో ప్రస్ఫుటమవుతుంది.

ఇంటిపని, కుటుంబ సంరక్షణ మహిళల ప్రధాన బాధ్యతలేనన్న భావన అనేక సమాజాల్లో నేటికీ బలంగా పాతుకుపోయి ఉండటమే దీనికి కారణం. దీంతో కొన్ని సమయాల్లో మహిళలు కుటుంబానికే అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం తలెత్తి, వారి ఉద్యోగ సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ఇటువంటి పరిస్థితులను మార్చాలన్న కృషి సాగుతున్నప్పటికీ దీర్ఘకాలికంగా ఎదురయ్యే దుష్పరిణామాల భయంతో మహిళలు అనేక సందర్భాల్లో నిరాసక్తత ప్రదర్శిస్తున్నారు. ఈ కారణాలవల్ల పురుషులతో పోలిస్తే మహిళలు తరచూ ఆత్మవిశ్వాసం సన్నగిల్లి సామాజిక ఒంటరితనంతో బాధపడటం జరుగుతోంది.

**ఇలా చేయండి:**

వ్యక్తిగతంగా లేదా మిత్రులతో కలిసి కింది సమస్యలను పరిశీలించండి:

- ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (UNDP)లోని మానవాభివృద్ధి సూచీలో మీ దేశం ఏ స్థానంలో ఉంది? (http://hdr.undp.org/en/content/human-development-index-mdg/hdi)
- మెరుగుదలకు అవకాశాలేమైనా ఉన్నాయా? ఉంటే... ఎలా?
- మీ దేశ మహిళలు ఏయే వృత్తిగతమైన రంగాలలో ఉన్నారు? వారేదైనా వివక్షను ఎదుర్కొంటున్నారా? (http://www.ilo.org/gender/lang/-en/index.htm)

## నిదర్శనాధ్యయనం 4:

**సౌమ్య తన జీవిత సవాళ్లను ఎలా ఎదుర్కొన్నారు... ఇతర మహిళలకు ఎలా సహాయపడ్డారు!**



*__సౌమ్య__ దక్షిణ భారతంలోని కర్ణాటక రాష్ట్రంలో ఓ గ్రామీణ ప్రాంత మహిళ. ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం మద్దతుతో నిర్వహించిన 'మార్పు కోసం సమాచార విజ్ఞానం' కార్యక్రమం కింద ఆరేళ్లపాటు సమాచార కేంద్రాలలో పనిచేశారు. స్వయం సహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడిచే ఈ కేంద్రాల్లో ఇంటర్నెట్, మొబైల్‌ఫోన్లు, అనుసంధాన పరిజ్ఞానం నేర్పుతారు. స్థానిక పాలన సంస్థల నుంచి తమ హక్కుల కోసం డిమాండ్ చేసేందుకు ఆ మహిళలు సదరు పరిజ్ఞానాన్ని వినియోగించుకునేలా శిక్షణ ఇస్తారు. ఓ 'సమాచార ప్రదాత'గా ప్రభుత్వ సేవల గురించి తాజా సమాచారాన్ని వివిధ ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ వనరులద్వారా సౌమ్య సేకరించేవారు. ఈ సమాచారం సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఉపయోగపడేది కావచ్చు. ప్రతి నెలా ఆమె కొన్ని కుగ్రామాలను సందర్శించి ఆ సమాచారాన్ని అందజేస్తూ సంక్షేమ పథకాల లబ్ధి, రాయితీలు పొందడంకోసం వారితో దరఖాస్తు చేయించేవారు. సౌమ్య అనుభవాలు ఆమె మాటల్లోనే...*

*"నేను 19 ఏళ్ల వయసులో ఉండగా మా బంధువుతో నాకు బలవంతంగా పెళ్లి జరిపించారు. మా తల్లిదండ్రులు సన్నకారు రైతులు కావడంతో ఆలస్యం చేస్తే మరొక సంబంధం చూడటం అంత సులభం కాదన్నది వారి భయం. పెళ్లి సమయంలో నా భర్తకు కొంత డబ్బును బహూకరించి ఓ జీప్ కొనుక్కుని జీవించాల్సిందిగా సూచించారు.*

*ఆ సమయానికి నేను సాహిత్యంలో డిగ్రీ చదువుతూ... మంచి ఉద్యోగం సంపాదిస్తే ఆర్థిక స్వేచ్ఛ పొందవచ్చుని కలలు కంటూండేదాన్ని. కానీ, పెళ్లి తర్వాత మూడు నెలలకే గర్భవతిని కావడంతో నా చదువు ఆపేయాల్సి వచ్చింది. ఆ తర్వాత ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లేదాకా అంతా బాగానే ఉన్నట్లు అనిపించింది. నేను ఆడపిల్లకు జన్మనిచ్చిన తర్వాత బిడ్డను చూసేందుకు నా భర్త వస్తాడని ఎదురుచూసినా ఆయన రానే లేదు. అప్పటికే తాగుడు, జూదానికి బానిసైన నా భర్త అప్పులపాలై అవి తీర్చేందుకు జీపును అమ్మేశాడని తెలిసింది. అటుపైన తాగుడు మరింత ముదిరి నిత్య ఘర్షణ తప్పని పరిస్థితి ఏర్పడటంతో నేను మళ్లీ పుట్టిల్లు చేరాల్సి వచ్చింది. అప్పట్లో సమాచార విజ్ఞాన కేంద్రాలతో ముడిపడిన మహిళా స్వయం సహాయక సంఘంలో మా అమ్మ సభ్యురాలుగా ఉండేది. ఈ ఉద్యోగావకాశం వచ్చినప్పుడు మా అమ్మ స్నేహితులు దీన్నిగురించి ఆమెకు చెప్పారు. నేను తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉండటం, మా తల్లిదండ్రులపై ఆధారపడలేని దుస్థితివల్ల ఈ ఉద్యోగంలో చేరాను. ఇక్కడ శిక్షణతో ఒక్క కంప్యూటర్ల గురించే కాకుండా అధికారులతో ధైర్యంగా మాట్లాడటం, ప్రజల సమక్షంలో సభల్లో వారితో మమేకం కావడంతోసహా ఎంతో నేర్చుకున్నాను.*

*కొన్ని నెలలు పనిచేసిన తర్వాత మళ్లీ నా భర్తతో కలిసి జీవించేందుకు ప్రయత్నించాను. ఆయనను వ్యసన విముక్తి కేంద్రానికి పంపాను. కానీ, ఎన్నిసార్లు బతిమాలినా పాత పద్ధతులను మార్చుకోలేదు. చివరకు అతణ్ని మార్చడం అసాధ్యమని, ఆ ప్రయత్నం కూడా వ్యర్థమని నాకు స్పష్టమైంది. అతడితో తెగదెంపులు చేసుకుని, వితంతువైన నా సోదరితో కలసి జీవించసాగాను. మేం ఇప్పటికీ కలిసే ఉన్నాం. నేను ఉద్యోగానికి వచ్చినపుడు నా కూతురి బాగోగులను ఆమే చూసుకుంటుంది. ఇప్పుడు నా బిడ్డ ప్రాథమిక విద్యాభ్యాసం చేస్తోంది. ఆమె పూర్తి స్వతంత్ర మహిళగా ఎదగాలన్నది నా ప్రగాఢ వాంఛ. ఆ దిశగా ఎంతవరకు చదువుకుంటానంటే అంతవరకూ చదివిస్తా. ఇదెంతో కష్టమేగానీ, నాలాగే కష్టాల్లో ఉన్న మహిళలను చూసి ఆత్మస్థైర్యం తెచ్చుకుంటుంటాను. అలాగే అలాంటివారికి సహాయపడుతూనే ఉంటాను.*

*నా కృషి ఫలితంగా ఇప్పుడు నేను గ్రామాలకు వెళ్తుంటే ఎంతో గుర్తింపు లభిస్తోంది. వృద్ధాప్య పెన్షన్ కోసం దరఖాస్తు నింపడంలో నేను సాయపడిన అనాథ వృద్ధులు, చౌకధరల దుకాణం నుంచి తమ నెలవారీ సరుకులు ఎలా డిమాండ్ చేయవచ్చో నేను సూచించగా తెలుసుకున్న మహిళా సంఘాల సభ్యులు, ప్రభుత్వ – ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు, వృత్తివిద్యా శిక్షణ తదితరాలపై నేను సమాచారం ఇచ్చిన విద్యార్థులు... నన్నెంతగానో ఆదరిస్తుంటారు. నేను చేస్తున్న పని నాకెంతో సంతోషాన్నిస్తోంది. నా చుట్టూ ఉన్న మహిళలకు, పిల్లలకు అన్ని హక్కులు–అవకాశాలను అందుకునే సామర్థ్యం కల్పించడమే నా జీవితాశయం. నా వ్యక్తిగత అనుభవాలే నా చుట్టూ ఉన్న మహిళల్లో ఏ ఒక్కరూ జీవితంలో ఓడిపోయామన్న న్యూనతా భావానికి గురికాకుండా చూడాలన్న దృఢ నిర్ణయం తీసుకునేలా చేసింది. ఆ మేరకు తమను చుట్టుముట్టే సవాళ్లకు ఎదురొడ్డి, స్వేచ్ఛగా ఎదిగేలా అలాంటివారికి తోడ్పడటమే బాధ్యతగా స్వీకరించాను.”*

### 3.1.2 లింగ పక్షపాత చట్టాలు - నియంత్రణ వాతావరణం

**ప్ర**భుత్వాల జవాబుదారీతనానికి రాజ్యాంగాలే ప్రాతిపదిక. ఆ మేరకు కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థల సూత్రాలతోపాటు ప్రభుత్వం, ప్రైవేటు వ్యక్తులు–సంస్థల హక్కులు, బాధ్యతలను కూడా నిర్దేశిస్తాయి. అయితే, లింగ వివక్షను రూపుమాపే విధంగా స్త్రీ, పురుష హక్కులనుగానీ, మహిళలకు మరిన్ని హక్కులు

కల్పించడం గురించిగానీ జాతీయ రాజ్యాంగాలు అన్ని సందర్భాల్లోనూ పేర్కొనవు. లింగ సమానత్వంపై ప్రపంచవ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన అధ్యయనం సందర్భంగా 170 దేశాలలో చట్టపరమైన అవరోధాలు భిన్నస్థాయిలలో ఉన్నట్లు తేలింది. దీనివల్ల పురుషులతో పోలిస్తే రాజ్యాంగపరంగా లభించే హక్కులు, రక్షణలు

| పట్టిక 1 | ప్రపంచవ్యాప్తంగా వివాహిత మహిళలపై విభిన్న చట్టపరమైన ఆంక్షల సంక్షిప్త చిత్రణ |
|---|---|
| ఆంక్ష (అన్ని దేశాలలో క్లుప్తంగా) | వివాహిత పురుషులతో పోలిస్తే వివాహిత మహిళలపై ఆంక్షలు ఎక్కువ |
| ఎక్కడ జీవించాలో నిర్ణయించుకోవచ్చు (25) | బెనిన్, బుర్కినా ఫాసో, కామెరూన్, ఛాద్, డీఆర్ కాంగో, కాంగో రిపబ్లిక్, గబన్, గినీ, హైతీ, ఇరాన్, జోర్డాన్, కువైట్, మలేసియా, మాలీ, నికరాగువా, నైగర్, ఓమన్, రువాండా, సౌదీ అరేబియా, సెనెగల్, సూడాన్, సిరియా, యూఏఈ, వెస్ట్‌బ్యాంక్-గాజా, యెమన్ |
| పిల్లలకు పౌరసత్వం ఇచ్చే దేశాలు (16) | గినీ, ఇరాన్, జోర్డాన్, కువైట్, లెబనాన్, మడగాస్కర్, మలేసియా, మాలీ, మారిటానియా, నేపాల్, ఓమన్, సౌదీ అరేబియా, సూడాన్, సిరియా, యూఏఈ, వెస్ట్‌బ్యాంక్-గాజా |
| అనుమతి లేకున్నా ఉద్యోగం పొందవచ్చు (15) | బొలీవియా, కామెరూన్, ఛాద్, డీఆర్ కాంగో, గబన్, గినీ, ఇరాన్, జోర్డాన్, కువైట్, నైగర్, సూడాన్, సిరియా, యూఏఈ, వెస్ట్‌బ్యాంక్-గాజా |
| ఇల్లుదాటి బయట పయనించొచ్చు(9) | ఇరాన్, జోర్డాన్, కువైట్, మలేసియా, ఓమన్, సూడాన్, సిరియా, వెస్ట్‌బ్యాంక్-గాజా, యెమన్ |
| దేశం వెలుపల పయనించొచ్చు(4) | ఓమన్, సౌదీ అరేబియా, సూడాన్, సిరియా |


ఆధారం: ప్రపంచబ్యాంకు, వాయిస్ అండ్ ఏజెన్సీ: ఉమ్మడి సౌభాగ్యం కోసం మహిళలు, బాలికలకు సాధికారిక (2014). http://www.worldbank.org/content/dam/Worldbank/document/Gender/Voice_and_agency_LOWRES.pdf.లో లభ్యం

మహిళలకు దక్కటంలేదని స్పష్టమైంది. “లింగ సమానత్వ సాధన దిశగా ఆరోగ్య, ఆర్థిక, నైతిక స్ఫూర్తినిచ్చే కార్యక్రమాలు చేపట్టినా పురుషులు-బాలురతో పోలిస్తే మహిళలు-బాలికలకు అవకాశాల అందుబాటు తక్కువే. లింగ వ్యత్యాస నిర్మూలన ఇంకా అన్నిటికన్నా అతిపెద్ద సవాలుగానే మిగిలి ఉంది” అని అధ్యయన నివేదిక కుండబద్దలు కొట్టింది. ప్రధానంగా ఆరోగ్యం, ఉపాధి, వివాహం వంటి సామాజిక, ఆర్థిక రంగాలలో మహిళలకు రక్షణ లేదని తేల్చింది. వ్యక్తిగతంగా వివక్షను ఎదుర్కొన్న మహిళలు అటు న్యాయ వ్యవస్థ (చట్టాలు, వాటి

వర్తింపు)తోనూ ఘర్షణ పడాల్సి వస్తోంది. దీంతో అనేక సందర్భాలలో వివక్షపై పోరాటం, న్యాయం పొందడం మహిళలకు కష్టమైపోతోంది.

**కొ**న్ని దేశాల్లో లింగ సమానత్వాన్ని చట్టాలు సమర్థిస్తున్నా కొందరు మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోలేని కారణంగా వాటి అమలులో అసమానత చోటుచేసుకుంటోంది. అనధికార, సంప్రదాయక చట్టాలు, ఆచారాల వివక్షను లింగ ప్రతిస్పందక చట్టాలు ఎదుర్కొనవచ్చు. కొన్ని దేశాలలో మహిళలకు ఆస్తి వారసత్వాన్ని వ్యతిరేకించే సంప్రదాయ చట్టాలు వనరులపై వారి యాజమాన్యానికి సంబంధించి వివక్ష చూపడం ఇందుకో ఉదాహరణ. వారసత్వాన్ని నిర్ణయించేందుకు కొన్ని సందర్భాల్లో కక్షిదారుల జాతి ఆధారంగా న్యాయ వ్యవస్థ నిర్ణయం తీసుకోవచ్చు. భారతదేశంలో భూ యాజమాన్యంపై మహిళలకు సముచిత చట్టబద్ధ హక్కు లేనందువల్ల విడాకులు, వైధవ్యం వంటి సందర్భాల్లో వారు నిస్సహాయులై పోయే ముప్పుంది. అలాగే వారి భర్తలు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినప్పుడు వారి స్థానంలో ఇంటిపెద్దగా వ్యవహరించే పాత్రపైనా ప్రభావం పడుతుంది.

**చిత్రం 2** సంపద, లైంగికత, పంచమాంశాల పరంగా పాఠశాల విద్య పూర్తిచేసే 15-19 ఏళ్ల విద్యార్థులు




ఆధారం: ప్రపంచబ్యాంకు, వాయిస్ అండ్ ఏజెన్సీ: ఉమ్మడి సౌభాగ్యం కోసం మహిళలు, బాలికల సాధికారిత (2014). http://www.worldbank.org/content/dam/Worldbank/document/Gender/Voice_and_agency_LOWRES.pdfలో లభ్యం

**భూ**మివంటి వనరుల యాజమాన్యం, నిర్వహణలో మహిళల సామర్థ్యం వారి రుణ పరపతి సామర్థ్యంతో ముడిపడి ఉంటుంది. భూమి యాజమాన్యం – నిర్వహణలతో సాధికారికకుగల సన్నిహిత సంబంధం సదరు భూమిద్వారా గ్రామీణ మహిళలు ఆహార భద్రత, జీవనోపాధి పొందడంపై తీవ్ర ప్రభావం కలిగి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ కూలీల్లో గ్రామీణ మహిళలు సగటున 43 శాతంగా ఉన్నప్పటికీ పురుషులతో పోలిస్తే సొంత భూమి కలిగిన మహిళల సంఖ్య తక్కువే. ఒకవేళ ఉన్నా ఆ భూమి తక్కువ విస్తీర్ణం, తక్కువ నాణ్యతకు పరిమితమైనదై ఉంటుంది.

### లైంగికత - భూమి హక్కుల సమాచార నిధి

**లైంగికత – భూమి హక్కుల సమాచార నిధి** పేరిట ఆహార, వ్యవసాయ సంస్థ (FAO) 2010లో ఒక సమాచార పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. అందులో దేశాలవారీగా లింగ సమానత్వ భూమి కౌలును ప్రోత్సహించే లేదా నిరోధించే అంశాలకు సంబంధించి చట్టబద్ధ పరిణామాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తోంది. ఇందులో నేటివరకూ 84 దేశాల వివరాలుండగా విధాన రూపకర్తలు, ప్రజా ప్రతినిధులు, మహిళలకు భూమి యాజమాన్యం–హక్కును సమర్థించేవారికి ఈ పోర్టల్ మద్దతునిస్తోంది. లింగ సమానత్వ భూమి కౌలుకు సంబంధించిన చట్టాలను పరిశీలించేందుకు ఇదో చట్ట అంచనాల ఉపకరణంగా ఉపయోగపడుతోంది. ఈ సమాచార పోర్టల్ ఆధారంగా భూమి కౌలులో లింగ వివక్షను ఎత్తిచూపవచ్చని ఎఫ్ఏవో ఆశిస్తోంది. అంతేగాక లింగ సమానత్వ భూమి కౌలును ప్రభావితం చేస్తున్న కీలక రాజకీయ, న్యాయ, సాంస్కృతిక అంశాలను గుర్తించే వీలుంటుంది. (చూడండి... http://www.fao.org/gender-landrights-database/en/)

**ఇలా చేయండి:**

వ్యక్తిగతంగా లేదా మిత్రులతో కలిసి కింది సమస్యలను పరిశీలించండి:

- **మీ దేశంలో సామాజిక, వృత్తి–చట్టపరమైన హక్కులపరంగా మహిళలపై ఏవైనా చట్టాలు వివక్ష చూపుతున్నాయా?**
- **ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలివ్వకపోయినా వివక్షపూరిత సామాజిక పద్ధతులేవైనా ఆచరణలో ఉన్నాయా?**

### 3.1.3 ప్రభుత్వ సేవల పరిమిత అందుబాటు

**మ**హిళలు, బాలికలకు మొత్తంమీద అందుబాటులో (నాణ్యత, ఫలితాలపరంగా) ఉండాల్సిన రెండు రంగాలు ప్రభుత్వ విద్య, ప్రజారోగ్య సేవలు మరింత మెరుగుపడాల్సి ఉంది. ఇవి పరిమితంగా మాత్రమే అందుబాటులో ఉంటే స్వల్ప–దీర్ఘకాలికంగానూ వారి ఎంపికల శ్రేణిపై పెను పరిణామాలు చోటు చేసుకుంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఐసీటీ పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న (విశేషించి మొబైల్ ఫోన్లు వాడే)వారిలో అత్యధికులకు తగినంత ప్రయోజనాత్మక అక్షరాస్యత లేదు. అనేకమంది నిరక్షరాస్యులైన మహిళలు కూడా మొబైల్ ఫోన్ లబ్ధి పొందగలుగుతున్నారు. కానీ, వారు అక్షరాస్యులైతే ఆ ఫోన్లలోని మరింత ఆధునిక సౌకర్యాలనుంచి కూడా ప్రయోజనం పొందగలరు. ఐసీటీ పరిజ్ఞానం నుంచి వీలైనంత ఎక్కువ లబ్ధి పొందాలంటే సాధారణంగా ఒక స్థాయి విద్యార్హత ఉండాలని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అక్షరాస్యత విషయానికొస్తే ప్రపంచవ్యాప్తంగా పురుషులకన్నా మహిళలు వెనుకబడుతున్నారు. ఇంటెల్ సంస్థ నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం... “వర్ధమాన దేశాలన్నిటిలోనూ అక్షరాస్యులైన పురుషులు 86 శాతంకాగా, మహిళలు 75 శాతమే.

మరికొన్ని దేశాల్లో ఈ వ్యత్యాసం బాగా ఎక్కువ... ఉదా॥ భారత్‌లో చదవడం, రాయడం తెలిసిన మహిళలు కేవలం 51 శాతం కాగా, పురుషులు 75 శాతంగా ఉన్నారు. ఈ ప్రాథమిక నైపుణ్యం లేనివారు ఇంటర్నెట్ సదుపాయాన్ని అందిపుచ్చుకోలేరు.

**ప్ర**పంచవ్యాప్తంగా సగటున మహిళా అక్షరాస్యత కనీసం ప్రాథమిక విద్య స్థాయిలోనైనా పెరుగుతోంది. కానీ, ప్రాథమిక విద్యాభ్యాస వయసులో ఉన్న 5.8 కోట్లమంది పిల్లలు బడి ముఖం చూడకపోగా వారిలో అత్యధికం దక్షిణాసియా దేశాల్లోనే ఉన్నారు. అంతేగాక ఉన్నత విద్య విషయంలో స్త్రీ, పురుష విద్యార్థుల మధ్య అసమానత చాలా ఎక్కువగా ఉంది. పేదరికం, మౌలిక సదుపాయాల లేమి లేక అవగాహన లోపం కారణంగా ప్రపంచంలోని అనేక దేశాల్లో యువతులు బలవంతంగా విద్యాభ్యాసానికి స్వస్తి చెప్పాల్సి వస్తోంది. ఫలితంగా సాంకేతికతతోసహా మహిళా అక్షరాస్యత స్థాయి పడిపోతోంది. ప్రపంచంలోని నిరక్షరాస్యులైన వయోజనుల్లో మూడింట రెండు వంతులు మహిళలేనని అక్షరాస్యతపై ఐక్యరాజ్యసమితి విద్యా, సాంస్కృతిక, వైజ్ఞానిక సంస్థ (UNESCO–యునెస్కో) గణాంకాలు పేర్కొంటున్నాయి.

**పే**దరికం తరచూ లింగ వ్యత్యాసాన్ని పెంచటమేగాక విద్య అందుబాటు విషయంలోనూ ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఆర్థికంగా సంఘర్షణతోపాటు వివక్షకు గురవుతున్న కారణంగా సమాజంలో పేద మహిళలకు రెట్టింపు సవాళ్లు ఎదురవుతుంటాయి. పలు దేశాల్లో పేద–ధనిక స్త్రీ / పురుష విద్యార్థుల మధ్య అగాధం నిరంతరంగా కొనసాగడాన్ని 2వ చిత్రంలో చూడవచ్చు. నిరుపేద కుటుంబాల్లోని బాలురతో పోలిస్తే ప్రాథమిక విద్య పూర్తిచేసే బాలికల సంఖ్య తక్కువ. అయితే, సంపన్న కుటుంబాల్లో బాలబాలికలు ప్రాథమిక విద్యను పూర్తిచేసే అవకాశాలు దాదాపు సమానంగా ఉంటాయి.

### 3.1.4 మహిళలపై హింస

**మ**హిళలపై ఆధిపత్యం చలాయించడంలో భాగంగా వారిమీద వ్యక్తిగతంగా / సామూహికంగానూ తరచూ హింస కొనసాగుతోంది. లింగపరమైన హింస మానవ ప్రాథమిక హక్కుల ఉల్లంఘనేగాక ప్రపంచవ్యాప్తంగా ఓ తీవ్రమైన సవాలు విసురుతోంది. దీనివల్ల మహిళలతోపాటు పురుషులు కూడా ముప్పును ఎదుర్కొంటున్నా, అటువంటి హింసతో మహిళలకే ప్రమాదం అధికం. ప్రపంచవ్యాప్తంగా 35 శాతానికిపైగా మహిళలు జీవిత భాగస్వామి చేతిలో శారీరక లేదా లైంగిక హింసకు గురవుతుండగా ఇతరుల చేతిలో లైంగిక హింసకు బాధితులవుతున్నారని ఒక అధ్యయనం పేర్కొంటోంది. ఇది ఇంట్లో లేదా సుపరిచిత ప్రాంతాల్లోనూ చోటుచేసుకోవచ్చునని, వాస్తవానికి ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు సన్నిహిత భాగస్వామి చేతిలోనే శారీరక / లైంగిక హింసకు గురవుతున్నారని వివరించింది.

**ఇ**లాంటి ఘోర దుశ్చర్యలు మానవ సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపడంతోపాటు మొత్తంగా వ్యక్తుల, కుటుంబాల, సమాజాల ఎదుగుదలను దెబ్బతీస్తాయి. అంతేకాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా వ్యతిరేక ప్రభావం చూపిస్తాయి. మహిళల సంక్షేమానికి లైంగిక వేధింపులు, లైంగిక హింస, ఆన్‌లైన్ వేధింపులు కూడా ముప్పుగా పరిణమించాయి. వారు వ్యాపార రంగంలో ప్రవేశించటానికి ప్రతిబంధకాలు కావటమేగాక బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అలాగే వారు నిర్వహించే ఆన్‌లైన్ కార్యకలాపాలు ఎంత ఫలవంతమైనవైనా, సామాజికంగా ప్రతిఫలాన్నిచ్చేవైనా వాటికి పరిమితులు తప్పడంలేదు.

సాధారణంగా పనిపాటలకు సంబంధించి పురుషులతో పోలిస్తే ఉపాధి కల్పన ప్రక్రియలో వివక్ష, వేతనంలో అసమానతలవంటి అవరోధాలు మహిళలకు అధికం. ఇది చాలదన్నట్లు వారు పని ప్రదేశంలో లైంగిక వేధింపులకూ గురవుతుంటారు.

## 3.2 సహాయకారకాలు

### 3.2.1 పాత్రధారులుగా ఇతర భాగస్వాములు

**మ**హిళా సాధికారికకు అనేక సంప్రదాయ సామాజిక నియమాలు ప్రతికూలమే. అయితే, ప్రపంచమంతటా మంచి సామాజిక పద్ధతులు కూడా వృద్ధి చెందుతూ మహిళా సంక్షేమానికి సానుకూల వాతావరణాన్ని ఏర్పరుస్తున్నాయి. ఈ కృషిలో పురుషులు, బాలురుసహా ఇతర సామాజిక భాగస్వాములు కూడా పాలుపంచుకుంటున్నారు. ఆ మేరకు కలిసిమెలిసి పనిచేస్తూ మహిళల సామాజిక, ఆర్థికాభివృద్ధికి భరోసా లభిస్తోంది. అయితే, బాలబాలికలు ఎలా ప్రవర్తించాలో, ఎలా ఆలోచించాలో, ఏయే విశ్వాసాలు కలిగి ఉండాలో నిర్దేశించడంద్వారా మహిళల–పురుషుల పాత్రను సమాజమే నిర్ణయిస్తున్న నేపథ్యంలో ఇలాంటి మంచి పద్ధతులన్నీ ప్రస్తుతానికి ప్రాథమికమైనవే అవుతాయి. వివక్షను పరిష్కరించడమంటే లింగ సమానత్వ ప్రయోజనాలను అనుభవించగలిగేలా, మహిళలపై హింసను నిరోధించగలిగేలా బాలబాలికలిద్దరికీ సానుకూల ఆదర్శపాత్ర ఇవ్వాల్సిన అవసరం ఉంది. మహిళా సాధికారిక కల్పన అంటే లింగ సమానత్వం దిశగా కృషి కోసం పురుషులకూ సాధికారిక కల్పించడమే.

## నిదర్శనాధ్యయనం 5 :

## భారత్‌లో గృహ హింసకు వ్యతిరేకంగా గళమెత్తడం

***దే**శంలో మహిళలపై హింసా పరంపరను భారత పురుషులు, బాలలు ఛేదించడం ప్రారంభించారు. పొరుగింట్లో పురుషుడు మహిళను వేధించడం వినిపిస్తే వెంటనే ఆ ఇంటి తలుపు తడతారు లేదా హింసను ఆపేందుకు ఏదో ఒక మార్గం యోచిస్తారు. "గంట కొట్టండి" (హిందీ భాషలో 'బెల్ బజావో') పేరిట సాగుతున్న ఈ ప్రచారోద్యమం గృహ హింస వ్యతిరేక చట్టాలపై అవగాహన పెంచుతోంది. తద్వారా సదరు నేరంపై ఫిర్యాదుల సంఖ్య కూడా పెరిగింది. ఒకప్పుడు భార్యను హింసించడం చెల్లుబాటైనప్పటికీ నేడు ఆమోదయోగ్యం కాదన్న వాస్తవం ఈ ఉద్యమంతో విశదమవుతోంది. హింసాత్మక ప్రవర్తన ఏ రూపంలో ఉన్నా దానికి వ్యతిరేకంగా పురుషులు, మహిళలు సంయుక్తంగా గొంతెత్తే విధంగా సహజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తోంది.*

### 3.2.2 న్యాయ సంస్కరణలు - ప్రతిస్పందనలు

**మ**హిళా సాధికారికను ప్రోత్సహించేందుకు జాతీయ రాజ్యాంగంలో, న్యాయ ప్రక్రియ–విధానాలలో, ప్రభుత్వ నియంత్రణలు, బడ్జెట్ కేటాయింపులు వగైరాలలో మార్పుచేర్పులు చేయాల్సి ఉంది. లింగ ప్రాతిపదికన హింసను అరికట్టాలంటే వివిధ దేశాలు ప్రత్యేక చట్టాలు చేయాలి లేదా ప్రస్తుత చట్టాల చట్రంలోనే తగిన కొత్త నిబంధనలను పొందుపరచాలి. గృహ హింస బాధితులు అత్తవారిల్లు ఎవరి పేరిట ఉందన్నదానితో నిమిత్తం

లేకుండా ఆ ఇంటిలోనే నివసించే హక్కును కల్పించే కొత్త చట్టమేదీ భారతదేశంలో లేదు. ఓ అధ్యయనంలో భాగంగా విశ్లేషణ నిర్వహించిన 100 దేశాలకుగాను 38 దేశాల్లో వైవాహిక అత్యాచారం, దాంపత్యంలో లైంగిక దౌర్జన్యాన్ని నేరంగా పరిగణిస్తూ స్పష్టమైన చట్టాలు చేశాయి. ఈ ఉదాహరణను బట్టి మహిళా సాధికారికకు అవరోధాలుగా ఉన్న నేరపూరిత అంశాలను పరిష్కరించేందుకు కొన్ని దేశాలు విధానాలను మారుస్తున్నాయన్న వాస్తవం స్పష్టమవుతోంది.

### ఆహార, వ్యవసాయ సంస్థ (FAO) చట్టం అంచనా ఉపకరణం

స్త్రీ, పురుషులకు భూమి విషయంలో ప్రస్తుత అసమానతల అంచనా కోసం ఆహార, వ్యవసాయ సంస్థ ఒక చట్టం అంచనా ఉపకరణాన్ని (LAT) రూపొందించింది. రాజ్యాంగం, వారసత్వం, జాతీయత, ఆస్తి హక్కులు, న్యాయం అందుబాటు తదితరాలలో లింగపరమైన వివక్ష నిర్మూలనే ఎల్ఏటీ ధ్యేయం. ప్రత్యేకించి దీని రూపకల్పన ఉద్దేశాలేమిటంటే:

- **భూమి కౌలుకు సంబంధించి లింగపరమైన సమానత్వం దిశగా బలాలు, బలహీనతలు, అవకాశాలను చట్ట పరిధిలో ప్రస్ఫుటం చేయడం**
- **చట్టంలో లింగపరమైన వ్యత్యాసానికి కారణమైన మూలాలను గుర్తించడం**
- **సంస్కరణలు తెచ్చేందుకు అనువైన కార్యాచరణను నిర్ధారించేందుకు తోడ్పడటం**

ఈ ఉపకరణంలో 30 చట్టపరమైన సూచీల జాబితా ఉండగా లక్షిత విధాన చొరవ కోసం 8 సముదాయాల కింద వర్గీకరించింది. అవేమిటంటే:

1. మానవ హక్కుల సాధనాలకు ఆమోదం
2. జాతీయ రాజ్యాంగంలో లింగపరమైన వివక్షను నిర్మూలించడం
3. మహిళల చట్టబద్ధ సామర్థ్యాన్ని గుర్తించడం
4. జాతీయతకు అనుగుణంగా లింగపరమైన సమాన హక్కులు
5. ఆస్తి హక్కులో లింగపరంగా సమానత్వం
6. వారసత్వ హక్కులో లింగ సమానత్వం
7. లింగ సమానత్వ అమలు, వివాద పరిష్కార యంత్రాంగాలు, న్యాయం అందుబాటు
8. స్థానిక, జాతీయ భూ సంబంధ చట్టాల అమలు సంస్థలలో మహిళలకు భాగస్వామ్యం

ఈ అంశాల ఆధారంగా 22కుపైగా దేశాలలో తీసిన అంచనాలతో భూమి కౌలుకు సంబంధించి లింగపరమైన సమానత్వాన్ని ఒక పారస్పరిక చిత్రపటంలో పోల్చి చూపారు. ఎల్ఏటీపై మరింత సమాచారం కావాలంటే.. http://www.fao.org/gender-landrights-database/legislation-assessment-tool/en/ చూడండి.

### 3.2.3 మహిళల రాజకీయ భాగస్వామ్యం పెంపు

**రా**జకీయ రిజర్వేషన్ కోటా పెంపువంటి విధానాలతోపాటు అన్ని స్థాయుల ప్రణాళిక సంస్థలలో మహిళా భాగస్వామ్యం పెంపు ద్వారా ప్రాతినిధ్య రాజకీయాలలో మరింతగా పాలుపంచుకునేలా మహిళలను ప్రోత్సహించడం సాధ్యమవుతుంది. మహిళా ప్రాతినిధ్యాన్ని నిర్దేశించే ఇలాంటి విధానాలవల్ల 2012లో ప్రపంచ దేశాల పార్లమెంటు సభ్యులలో మహిళల సంఖ్య 25 శాతానికి చేరింది. అలాగే రాజకీయ భాగస్వామ్యం, నాయకత్వంలో మహిళల సామర్థ్యం పెంపునకు నిధులు కేటాయించడంద్వారా వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచవచ్చు. మహిళల సమానత్వం కోసం ఫిలిప్పైన్స్‌లో విస్తృత రాజ్యాంగ, న్యాయ, నియంత్రణ, బడ్జెట్ కేటాయింపుల వంటి వెసులుబాట్లు ఉన్నాయి. నాయకత్వ పాత్రలో మహిళా వ్యతిరేక మూస పద్ధతులను మార్చడంలో మహిళా రాజకీయ నాయకులు దోహదకారులు కాగలరు.

### 3.2.4 మహిళల కోసం విద్యాసేవల మెరుగుదల

**బ్రి**టన్ ప్రణాళిక నిర్వచనం ప్రకారం: “అదనంగా ఒక ఏడాది చదువుకోగలిగితే యువతుల ఆదాయం 10 నుంచి 20 శాతం పెరగడమేగాక పేదరిక వలయాన్ని ఛేదించే దిశగా గణనీయ స్థాయిలో అడుగు పడుతుంది. విద్యావంతులైన యువతులంటే– వారి జీవితం మెరుగుపడటంతోపాటు వారి పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుంది. అలాగే మరింత సౌభాగ్యవంతమైన సమాజం, మెరుగైన కార్మికశక్తి, సంపన్న జాతి రూపుదిద్దుకుంటాయి.” దీనికి సంబంధించి ప్రభుత్వం, పౌరులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు విద్యాసేవా ప్రదాతల వంటి భాగస్వాములు సహ భాగస్వామ్యంతో కృషి చేయాల్సిన అవసరం ఉంది. తద్వారా ప్రాథమికంగానేగాక తృతీయస్థాయి (ఉన్నత విద్య దశ)దాకా లింగ సమానత్వం సాధ్యం కావడమేగాక విద్యానంతరమహిళల ఉపాధి అవకాశాలకూ భరోసా లభిస్తుంది. చక్కగా రూపొందిన సాధారణ విద్యతో విద్యార్థులకు మెరుగైన, సాధికార అభ్యాస అనుభవం లభిస్తుందని సాధికారికపై నిర్వహించిన పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

**వై**జ్ఞానిక, సాంకేతిక, ఇంజనీరింగ్, గణిత (STEM) రంగాలలో మహిళలు మరింతగా ప్రవేశించడం కోసం ప్రత్యేక మద్దతు, ప్రోత్సాహం అవసరం. అత్యున్నత సామర్థ్యంగల మహిళలకు స్టెమ్ విద్యతో సానుకూల, సార్థక సహసంబంధం ఉందని పరిశోధనల్లోనూ తేలింది. తమ భవిష్యత్తును రూపుదిద్దుకోవడంలో, వృత్తిపరంగా తమపైగల అపోహలను పటాపంచలు చేయడంలో స్టెమ్ పోషించిన ప్రధాన పాత్ర గురించి పరిశోధన సందర్భంగా కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ పట్టభద్రులైన యువతులు నొక్కిచెప్పారు. కుటుంబ మనుగడ కోసం వ్యాపారం ప్రారంభించడంలో పురుషులతో పోలిస్తే మహిళలు ఎక్కువగా ముందంజ వేస్తారని పరిశోధన స్పష్టం చేసింది. మంచి వ్యాపార అవకాశం వచ్చినట్లు గుర్తించడంకన్నా అవసరార్థం వారు ఆ మేరకు స్పందించగలరని పేర్కొంది. దీంతోపాటు ఆదాయ సృష్టి మార్గాలుగానీ, ఉద్యోగావకాశాలుగానీ లేని పరిస్థితి తరచూ ఎదురవడం కూడా వారిని ఇందుకు పురిగొల్పుతుందని తేలింది. ప్రత్యేకించి అభివృద్ధి చెందిన దేశాలకన్నా వర్ధమాన దేశాల విషయంలో ఇది పూర్తిగా వాస్తవం. ఆ మేరకు అణగారినవర్గాలవారు, పేదలు, సాపేక్షంగా స్వల్ప నైపుణ్యంగల మహిళలు పారిశ్రామికతను ఒక జీవన మార్గంగా భావిస్తారు.

**మ**హిళల ఆర్థిక అవకాశాలను పెంచేలా వారి సామర్థ్యం, నైపుణ్యాలను బలోపేతం చేస్తే మరింత ఆదాయం ఆర్జించగల సాధికారికను సాధించగలరని పరిశోధన నిగ్గుతేల్చింది. అలాగే ఆదాయంలో అధికభాగాన్ని పిల్లల సంరక్షణ, విద్యాభ్యాసం కోసం వెచ్చించడమేగాక ఆస్తులు పోగుచేసి ఆర్థిక భద్రతను పెంచుకోగలిగే అవకాశాలున్నాయనీ తేలింది. కాబట్టి పారిశ్రామికతే చాలామంది మహిళలకు ఆర్థిక, సామాజిక - సాంస్కృతిక, రాజకీయ కార్యాచరణగా మారిందని చెప్పవచ్చు. పేదరికం నుంచి లేదా ఆర్థిక అనిశ్చితి నుంచి బయటపడటం కోసం ముఖ్యంగా కష్టసమయాల్లో చిన్న వ్యాపారం ప్రారంభించడంవైపే మహిళలు మొగ్గు చూపుతారని పరిశోధన ఫలితాలు పేర్కొంటున్నాయి.

### 3.2.5 ఐసీటీ వినియోగం

**స**మాచార, సందేశ సాంకేతిక పరిజ్ఞానా (ICT)ల వినియోగానికి సంబంధించి అవకాశాలు అపారం. ఐసీటీలను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ అవగాహన ఉపకరణాలుగా వాడుకోవచ్చు. వ్యక్తిగత-సంస్థాగత అనువర్తనాలకు, మహిళలకు ఆరోగ్యం, విద్యవంటి ప్రజా సేవల కల్పన మెరుగుకు వినియోగించవచ్చు. తమ ప్రాధాన్యాలు, అవసరాలను వివరించడంలో వారు సౌకర్యవంతంగా భావించే వాతావరణ సృష్టి-నిర్వహణద్వారా మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని కూడా ఐసీటీ పెంచగలదు. మహిళల నిర్దిష్ట అవసరాలను పరిష్కరించేలా ఐసీటీ ఉపకరణాలను అభివృద్ధి చేయవచ్చు.

**మహిళల ఆర్థిక సాధికారిక కల్పనకు ఐసీటీ కొత్త అవకాశాలను ఎలా కల్పిస్తుందంటే:**

- **ఐసీటీ ఆధారిత ప్రాజెక్టులలో మహిళలకు యజమానులుగా, మేనేజర్లుగా, ఉద్యోగులుగా అవకాశాలను సృష్టించవచ్చు.**
- **మహిళలు అందించే సేవలను మెరుగుపరచవచ్చు... (ఉదా॥ అక్షరాస్యత కార్యక్రమాలు, వ్యాపార ప్రణాళిక కోర్సులు, ఐసీటీ శిక్షణ, విపణి-వ్యాపార సమాచార సేవలతో అనుసంధానం, ఆన్‌లైన్ వాణిజ్య కార్యకలాపాలు)**
- **ఐసీటీ రంగం, పారిశ్రామికతసహా జీతంతో కూడిన ఉద్యోగాలు, ఐసీటీతో అందివచ్చే ఉద్యోగాలద్వారా ఆర్థిక అవకాశాలు అందుబాటులోకి తేవడం**

దీనికి సంబంధించిన ఉదాహరణలను ఐసీటీపై దిగువ ఇచ్చిన విభాగంలో వివరించాం:

## మిమ్మల్ని మీరే పరీక్షించుకోండి

- **మహిళా సాధికారిక సాధనకు సహాయపడటంలో ఏం చేయగలం?**
- **మహిళలు, పురుషుల భిన్న, నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా సరళమైన పని వెసులుబాటుకు రూపకల్పన చేసే విధంగా కంపెనీలను, ప్రభుత్వ కార్యాలయాలను ప్రోత్సహించగలమా?**
- **మహిళా సాధికారిక సాధనలో ఆరోగ్యం, విద్యకు సంబంధించిన ప్రభుత్వ సేవలకుగల ప్రాముఖ్యం ఏమిటి?**
- **మహిళలు, ఇతర అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకోవడంలో ఐసీటీ వినియోగం ఎలా?**

## కీలక సందేశాలు

- **ప్రపంచ జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళలు సామాజిక-ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రగతిలో తమవంతు పాత్ర పోషిస్తున్నారు**
- **అభివృద్ధిలో నిష్క్రియాపరులైన భాగస్వాములుగా మహిళలను పక్కకు నెట్టివేయడం (వివక్ష) వల్ల ప్రభుత్వ సేవలనుంచి వారు లబ్ధి పొందలేకపోతున్నారు. అంతేగాక తరచూ హింసకు గురవుతున్నారు.**
- **అభివృద్ధిలో సమాన భాగస్వాములుగా మహిళలు తమనుతాము చాటుకోవాలంటే సాధికారిక కల్పన ప్రక్రియలకు మద్దతు తప్పనిసరి. మహిళల్లో పారిశ్రామికతకు ప్రోత్సాహం, ఐసీటీ ప్రయోజనాలను అందిపుచ్చుకునేలా చేయడం వంటివి ఈ ప్రక్రియలలో భాగంగా ఉంటాయి.**

## 4 మహిళా సాధికారిక సాధనను ఐసీటీ ఎలా ప్రోత్సహిస్తుంది?

**మ**హిళా సాధికారిక అనే ఉమ్మడి లక్ష్యం సాధించేందుకు సామూహికంగా కృషిచేయగల అనేక సహాయకారకాలు ఉన్నాయి. వాటిలో ఐసీటీ కీలక చోదకంగా నిలుస్తుంది. అభివృద్ధి చెందిన, చెందుతున్న (వర్ధమాన) దేశాల్లో కొత్త సాంకేతిక పరిజ్ఞానం ముందంజ వేస్తుండగా మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల సేవలు విస్తృత వినియోగంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో మహిళలు తమకు ఎదురవుతున్న అవరోధాలను అధిగమించి తమను తాము సృజనాత్మకులుగా, ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దుకోవడంలో ఐసీటీ ప్రధాన సహాయకారి కాగలదు. మహిళా సాధికారికను ప్రోత్సహించి, సాకారం చేయడంలో ఐసీటీ పోషించే పాత్రను ఈ విభాగం వివరిస్తుంది.

### 4.1 ఐసీటీ అంటే ఏమిటి?

**సృ**ష్టి, సంధానం, నిల్వ, నిర్వహణ, సమాచార ప్రసారం-స్వీకారం తదితర సాంకేతికతలన్నిటినీ సమాచార, సందేశ సాంకేతిక పరిజ్ఞానమని చెప్పవచ్చు. విస్తృత బహుళమాధ్యమ, సందేశ ఉపకరణాలన్నీ ఇందులో అంతర్భాగమే. రేడియో, టెలివిజన్, టెలిఫోన్ వంటి పాత మాధ్యమాలు మాత్రమేగాక కొత్త మాధ్యమ చట్రాలు (స్థిర లేదా వైర్‌లెస్ ఇంటర్నెట్), హార్డ్‌వేర్ (కంప్యూటర్, మొబైల్ ఫోన్లు, టాబ్లెట్ కంప్యూటర్లు), సాఫ్ట్‌వేర్ (సామాజిక మాధ్యమ సేవలు, బహుళ మాధ్యమ అనువర్తనాలు, మొబైల్ యాప్‌లు) వగైరా కూడా ఇందులో భాగం కాగలవు. ఐసీటీ రంగ ప్రవేశం తర్వాత 1990 దశకం చివరి భాగంనుంచి రాజకీయ వ్యవహారాల్లో ప్రజా భాగస్వామ్యంసహా ప్రజా జీవనం, పనిపాటలుసహా సామాజిక కార్యకలాపాలను కూడా అది పూర్తిగా మార్చివేసింది. ఇటీవలి కాలంలో వర్ధమాన దేశాలలో ఇది అందుబాటులోకి వస్తున్నకొద్దీ చివరకు మారుమూల గ్రామాలుసహా గ్రామీణ ప్రాంతాల్లో మార్పులు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి 2015 చివరినాటికి ప్రపంచవ్యాప్తంగా మొబైల్ ఫోన్ చందాదారులు 700 కోట్లకుపైగా నమోదైతే గడచిన కొన్నేళ్లలోనే వర్ధమాన దేశాల్లో ఈ సంఖ్య విస్ఫోట స్థాయిలో పెరిగిపోయింది. దీనికితోడు ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య కూడా వేగంగా పెరిగి, ప్రస్తుతం 320 కోట్లకు చేరగా, అందులో 200 కోట్ల మంది వర్ధమాన దేశాల్లోనే ఉన్నారు.

**ఐ**సీటీ అందుబాటు పెరుగుతున్నకొద్దీ వినూత్న సేవలు, మార్పులకు కొత్త దారులు తెరుచుకుంటున్నాయి. ఉదాహరణకు మొబైల్ ఫోన్ ఇప్పుడు స్నేహితులు, కుటుంబసభ్యులతో మాట్లాడుకోవటానికి మాత్రమే పరిమితం

కాలేదు. సమాచారాన్వేషణ, ఫొటోలు–ఈమెయిళ్లు పంపడం, ఆన్‌లైన్‌లోనే వస్తువులు కొని– డబ్బు చెల్లించడానికి కూడా వాటిని వినియోగిస్తున్నాం. ఫేస్‌బుక్, ట్విటర్ వంటి సామాజిక మాధ్యమాల సేవలు జనం మధ్య చర్చలు, వార్తల చేరవేత, వ్యాపార ప్రచారం, రాజకీయ భాగస్వామ్యం తదితరాలకూ ఉపయోగపడుతున్నాయి.

**ఇలా చేయండి:**

వ్యక్తిగతంగా లేదా మిత్రులతో కలిసి కింది సమస్యలను పరిశీలించండి:

- **ప్రపంచ ఆర్థిక వేదిక సంసిద్ధత నెట్‌వర్క్ సూచీలో మీ దేశం ఏ స్థానంలో ఉంది?** http://reports.weforum.org/global-information-technology-report-2015/network-readiness-index/ **ను సంప్రదించండి**

  **మెరుగుపరిచే అవకాశాలేమైనా ఉన్నాయా? ఉంటే... ఎలా?**

## 4.2 మహిళా సాధికారికకు ఐసీటీ అవకాశాలు

### 4.2.1 సమాచారం అందుబాటు, సందేశ ఆదానప్రదానాల్లో పెరుగుదల

**మ**హిళలు కుటుంబసభ్యులు–స్నేహితులు, వ్యాపార సరఫరాదారులు–ఖాతాదారులతో నిత్య సమాచార సంబంధాలు నెలకొల్పుకోవడం–నెరపడంలో ఐసీటీ చౌకైన సాధనంగా ఉపయోగపడుతుంది. కుటుంబసభ్యులు వలస వెళ్లడం లేదా వారితో సుదీర్ఘంగా మాట్లాడాల్సి రావడం వంటి సందర్భాల్లో మహిళలు ఫోన్లను, ఇంటర్నెట్‌ను సమర్థంగా వినియోగించుకుంటున్నారని పరిశోధనలో వెల్లడైంది. ఉదాహరణకు చైనాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల్లోని ఫ్యాక్టరీల్లో ఉపాధి కోసం వెళ్లిన అనేకమంది యువతులకు స్వగ్రామంలోని తమ కుటుంబసభ్యులతో సంబంధాలు నెరపడంలో మొబైల్‌ఫోన్లు ప్రధాన ఉపకరణాలుగా ఉన్నాయని పరిశోధకులు పలువురు గుర్తించారు. అలాగే ఇతర ప్రాంతాలకు వలసవెళ్లిన తమవంటి మహిళలతోనూ వారికి సంబంధాలు ఏర్పడటంలోనూ అవి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని తేలింది. అలాగే భారతదేశంలోని కేరళ రాష్ట్రంలోని మత్స్యకార మహిళలు చేపల కొనుగోలు కోసం దూరప్రాంతాలకు ప్రయాణించే సమయంలో తమ కుటుంబాలతో ఫోన్లద్వారానే సమాచార సంబంధాలు నెరపుతుంటారు. ప్రపంచీకరణసహా స్థానిక చేపల మార్కెట్లలో పోటీ పెరుగుతున్న నేపథ్యంలో వారి దూర ప్రయాణ అవసరం పెరగడంతోపాటు మారుతున్న ఆర్థిక వాస్తవాలతో నెగ్గుకురావడానికీ మొబైల్‌ఫోన్లు తోడ్పడుతున్నాయి.

**మ**హిళల ప్రత్యేక అవసరాలైన ప్రసూతి రక్షణ, శిశు సంరక్షణ, విద్య, వ్యవసాయం తదితరాలకు కావాల్సిన సమాచారం, పరిజ్ఞాన వనరులను కూడా ఐసీటీ ప్రభావవంతంగా అందుబాటులోకి తెచ్చింది. అలాగే భారతదేశంలో స్వల్ప అక్షరాస్యులు, నిరక్షరాస్యులైన వ్యవసాయదారుల సామర్థ్య నిర్మాణంలో వినియోగ కేంద్రక ఐసీటీ అనువర్తనం 'కృషి–మిత్ర' ఎంతగానో దోహదపడుతోంది. దీన్ని ప్రధానంగా వినియోగించే గ్రామీణులు సులభంగా సమాచార, సందేశ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు వీలుగా దృశ్య – శ్రవణ – సందేశ రూపాల్లో ఈ పరిజ్ఞానం ఉపయోగపడుతోంది. రైతులు, వ్యవసాయ నిపుణుల మధ్య రెండువైపులా అన్యోన్య ఆదానప్రదానానికి ఈ అనువర్తనం ఎంతో ప్రయోజనకరంగా ఉంది.

## నిదర్శనాధ్యయనం 6 :

### 'తజిక్‌మమా వ్యవస్థాపకురాలు నసీబాఖాన్ అమినోవాతో ముఖాముఖీ

***నసీబాఖాన్ అమినోవా వయసు 36 సంవత్సరాలు. ఆమె స్థాపించిన 'తజిక్‌మమా.టిజె' వెబ్‌సైట్ పిల్లల పెంపకం, విద్యాభ్యాసంపై తజికిస్థాన్‌లోని తల్లిదండ్రులకు విశేష సమాచారం అందిస్తుంది. ఫేస్‌బుక్‌లోని ఈ సంస్థ గ్రూప్‌లో 8,500 మందికిపైగా సభ్యులున్నారు.***




*తజిక్‌మమాను స్థాపించడానికి ప్రధాన కారణమేమిటి?*

నేను ఐదేళ్లపాటు మాస్కోలో ఉండి తిరిగివచ్చాక ఇక్కడ నా పిల్లల కోసం సరైన పాఠశాలను అన్వేషించడం పెద్ద సవాలుగా మారింది. రష్యాలో అయితే, అనేకమంది తల్లులతో కూడిన పెద్దపెద్ద ఆన్‌లైన్ బృందాలు పరస్పరం ప్రభావవంతంగా సహకరించుకుంటూ ఉంటారు. పిల్లల పెంపకం, పాఠశాలల్లో చేర్చి వారి చదువుసంధ్యలను పర్యవేక్షించడంపైనా ఒకరికొకరు సహాయపడుతుంటారు. అయితే, మా దేశంలో పరిస్థితి ఇందుకు పూర్తిగా విరుద్ధం. మా ప్రాంతంలోని పాఠశాలల గురించి ఆన్‌లైన్‌లో పిసరంత సమాచారం కూడా లభ్యం కాలేదు. అసలు ఏ విద్యా సంస్థకూ అధికారిక వెబ్‌పేజీ అంటూ లేనేలేదు.

*తజిక్‌మమాను ఎలా స్థాపించారు?*

నేను 2012 మార్చి నెలలో నా స్నేహితులు, పరిచయస్తులు కలిపి ఓ 25 మందితో ఫేస్‌బుక్‌లో ఓ చిన్న బృందాన్ని ఏర్పాటు చేశాను. అప్పట్నుంచీ పాఠశాలలు, శిశు సంరక్షక కేంద్రాలు, వాటి చిరునామాలు, ఫోన్ నంబర్లు తదితర సమాచారాన్ని పంచుకుంటూ, సలహాలిచ్చుకుంటూ వచ్చాం. అలా రెండు నెలలు గడిచాక ఫేస్‌బుక్ వినియోగించనివారికి ఈ సమాచారం అందించేందుకు 'తజిక్‌మమా' (http://www.tajikmama.tj) పేరుతో వెబ్‌సైట్ ప్రారంభించాను. ఇది మరింత సమాచారంతో స్థిరంగా ఎదిగి, అనేకమంది మా బృందంలో సభ్యులుగా చేరారు. కేవలం తల్లిదండ్రులే కాకుండా తాతయ్యలు, బామ్మలతోపాటు కాబోయే తల్లిదండ్రులు కూడా త్వరలోనే సభ్యులయ్యారు. చివరకు పురపాలక, ప్రభుత్వ పాఠశాలల అధికారులు కూడా ఇందులో చేరారు.

*మీ వ్యాపారానికి నిధులు ఎలా సేకరించారు?*

మొదట్లో నా సొంత డబ్బుతోనే దీన్ని ప్రారంభించగా, అడపాదడపా స్నేహితులు విరాళాలిచ్చేవారు. ఇప్పుడు నా వెబ్‌సైట్‌లో ప్రకటనలతోపాటు ఇతర వాణిజ్య ఆసక్తులువల్ల ఆదాయం లభిస్తోంది. ఇప్పుడు దేశవ్యాప్తంగాగల తల్లిదండ్రులు, పిల్లల కోసం నేను స్వచ్ఛంద ప్రచారం, ఇతర కార్యక్రమాలను క్రమం

తప్పకుండా నిర్వహిస్తున్నాను. అంతేకాకుండా తల్లులు, గృహిణులు, ప్రసూతి సెలవులో ఉండే మహిళలు తయారుచేసే ఉత్పత్తులను 'తజిక్‌మమా ఉత్పత్తులు' పేరిట వెబ్‌సైట్‌లో విక్రయించే అవకాశం కల్పించాను.

***ఇతర ఆన్‌లైన్ వ్యాపారాలతో పోలిస్తే తజిక్‌మమా విశిష్టత ఏమిటి?***

తజిక్‌మమా అందరు వినియోగదారులను తల్లిదండ్రులుగా ఏకం చేస్తుంది. మేమంతా లాయర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు ఎవరైనా కావచ్చు... కానీ, మేమంతా తల్లిదండ్రులం కూడా. సభ్యులు పాఠశాలల గురించి సమాచారం పంపుతుంటారు. అనేక పాఠశాలలకు ఇప్పటికీ అధికారిక వెబ్‌సైట్లు లేనందువల్ల ఈ సమాచారం ఇతర తల్లిదండ్రులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆ విధంగా తజిక్‌మమా 'జాగరూకులైన తల్లిదండ్రుల' సామాజిక ఉద్యమంగా రూపుదిద్దుకుంది.

***కాబోయే వ్యాపారారంభకులకు మీరిచ్చే సలహా ఏమిటి?***

మీరు చేసేది ఏదైనా దాన్ని స్వచ్ఛంగా ప్రేమించండి. లేనట్లయితే అది విజయవంతం కాబోదు. మనం చేస్తున్నది మంచిపనే అయినప్పుడు మన జీవితంతోపాటు మన చుట్టూ ఉన్న ఇతరుల జీవితాల్లోనూ మార్పు తథ్యమన్న భావనే విశేష ఫలితమిస్తుంది.

### 4.2.2 ప్రభుత్వ సేవల అందుబాటు

**స**మయం, దూరంతో నిమిత్తం లేకుండా సమాచార సేవలందించగల ఐసీటీ... వాటితోపాటు నిత్యావసరాలైన విద్య, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక సేవలవంటి ప్రజా సేవలను కూడా అందించగలదు. ఆన్‌లైన్, మొబైల్ మాధ్యమాలను విస్తృతంగా వినియోగించే ప్రజలకేగాక అలాంటివి అందుబాటులో లేనివారికీ ఐసీటీద్వారా సేవలందుతాయి. పన్నులు, భూమి రిజిస్ట్రేషన్, పాస్‌పోర్టు దరఖాస్తు తదితర ప్రభుత్వ సంబంధ సేవలనూ ఐసీటీ వినియోగంతో చాలా సులభంగా, సమర్థంగా పూర్తిచేయడం సాధ్యంగనుక మహిళల జీవితాలను ఈ పరిజ్ఞానం సులభతరం చేయగలదు.

**మ**హిళలు, బాలికల సాధికారిక దిశగా యునెస్కో, నోకియా సంస్థ సంయుక్తంగా మొబైల్ అభ్యాస కార్యక్రమాన్ని ప్రారంభించాయి. తమ జీవితాలకు తామే దిశానిర్దేశం చేసుకోగలిగేలా, తమ హక్కులు, లక్ష్యాలపై అవగాహనతో ఆత్మవిశ్వాసం పెంపొందించడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఆ మేరకు ప్రాథమిక స్థాయి మొబైల్ ఫోన్లు, సంక్షిప్త సందేశాల (SMS)ద్వారా వారికోసం ప్రత్యేకించిన అభ్యాస, విద్యా సరంజామాను అందించాయి.

**ఐ**సీటీ అనువర్తనంద్వారా సానుకూల మార్పు చెందగల అభివృద్ధి చెందుతున్న రంగాలలో ఆరోగ్య సంరక్షణ రంగం కూడా ఒకటి. వైద్య సమాచారం నిర్వహణ, ఆరోగ్య సదుపాయాల మధ్య సమాచార బదిలీకి భరోసా, వైద్య పరిజ్ఞాన (ఆఫ్‌లైన్ / ఆన్‌లైన్) విస్తృతి తదితరాల కోసం వ్యక్తిగత, సంస్థాగత స్థాయిలో ఐసీటీని ఈ రంగం భారీగా వినియోగించుకుంటోంది. ఆరోగ్య సంబంధ సేవలకు ప్రత్యేకించి భౌగోళిక, ఆర్థిక సవాళ్లున్న ప్రాంతాల

కోసం కూడా ఐసీటీని ప్రభావవంతంగా వినియోగిస్తూ వినూత్న పరిష్కారాలు అందిస్తున్నారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో వినూత్న ఐసీటీ ఆవిష్కరణలతో వర్ధమాన దేశాల్లోని గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాల మహిళలు గణనీయంగా లబ్ధి పొందుతున్నారు.

**ఉ**దాహరణకు ఇండోనేషియాలోని ఏసా బేసర్ ప్రాంతంలోని మంత్రసానులు (నర్సులు) మొబైల్ ఫోన్ల కార్యక్రమం సహాయంతో మాతాశిశు ఆరోగ్యం మెరుగుకు తక్కువ ఖర్చుగల ఐసీటీ పరిష్కారాలను వినియోగిస్తారు. క్షేత్రస్థాయిలోని నర్సులు తమ మొబైల్ ఫోన్లు, ప్రత్యేక ఎస్ఎంఎస్ వ్యవస్థ సాయంతో కేంద్రీయ సమాచార భాండాగారంలో రోగుల ఆరోగ్య సమాచారాన్ని నిర్వహించడంతోపాటు ఎప్పటికప్పుడు నవీకరిస్తారు. ప్రత్యేక వైద్య నిపుణులతో వారు నేరుగా సంభాషించే సదుపాయం కూడా ఈ వ్యవస్థలో ఉంది. భారత దేశంలో ఆరోగ్య కార్యక్రమాలద్వారా మాతాశిశు ఆరోగ్య సమస్యలపై దృశ్య-శ్రవణ సరంజామాను అభివృద్ధి చేస్తున్నారు. దీన్ని నిర్దేశిత సామాజిక సభ్యుల (మహిళలు)కు ఆరోగ్య కార్యకర్తలద్వారా వారి ఆవాసాలు, ఇళ్లవద్దనే అందజేస్తున్నారు. మహిళలు ఆరోగ్య సంరక్షణపై నిర్ణయాత్మకంగా వ్యవహరించేలా చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ఈ సందర్భంగా మయన్మార్‌లో ఓ మొబైల్ సేవల సంస్థ ఆవిష్కరించిన వినూత్న ఆరోగ్య సేవకు లభిస్తున్న ప్రజాదరణ గురించి ఇక్కడి వివరించాం.

## నిదర్శనాధ్యయనం 7:

### మయన్మార్‌లో ఒరీడో రూపొందించిన 'మేమే' యాప్ ఏమిటిది?




***మెమే** (స్థానిక భాషలో 'అమ్మ' అని అర్థం)... ప్రసూతి రక్షణకు ఉద్దేశించిన మొబైల్ ఆధారిత ఆరోగ్య సంరక్షణ సేవలందించే ఒక యాప్. మయన్మార్‌లోని మొబైల్ టెలికం సేవల సంస్థ 'ఒరీడో' దీని రూపకర్త. దీన్ని 2014లో ప్రారంభించగా మొబైల్ ఫోన్లద్వారా ఆరోగ్య సమస్యలు, శిశు సంరక్షణ గురించి గర్భిణులకు సమాచారం అందజేస్తోంది. ప్రపంచ మొబైల్ ఆపరేటర్ల సంఘం (GSMA), అంతర్జాతీయ జనాభా సేవల సంస్థ (PSI), కోకో టెక్‌లు ఈ యాప్ రూపకల్పనలో ఒరీడోతో పాలుపంచుకున్నాయి. జీఎస్ఎంఏ అనుబంధ మహిళా కార్యక్రమం, అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ, ఐక్యరాజ్యసమితి, చెరీబ్లేర్ మహిళా ఫౌండేషన్ ఇందులో భాగస్వాములుగా ఉన్నాయి.*

### ఇదెలా పనిచేస్తుంది?

***అ**త్యధిక మాతాశిశు మరణాలతోపాటు పిల్లల్లో తీవ్ర పౌష్టికాహార లోపం, అనేక ప్రసూతి సంబంధ ఆరోగ్య సమస్యలతో మయన్మార్ ప్రస్తుతం సతమతమవుతోంది. దేశంలో 70 శాతం శిశు జననాలు ఎలాంటి వైద్య*

*సహాయం లేకుండానే జరుగుతున్నాయి. మాతాశిశు ఆరోగ్యం గురించి యువ దంపతులకు, గర్భిణులకు, వారి కుటుంబాలకు సమాచారం అంతంతమాత్రమే. ఈ సమస్యలన్నిటినీ పరిష్కరించే దిశగా 'మెమే' కింద సేవలందిస్తోంది:-*

- *ప్రసూతి ఆరోగ్య సలహాలు- ఈ యాప్ వినియోగదారులు గర్భధారణ దశలకు అనుగుణంగా వారానికి మూడుసార్లు ప్రసూతి ఆరోగ్య జాగ్రత్తలు అందుకుంటారు.*
- *డాక్టర్ సమాచారం అందించే సేవ- వినియోగదారుల జీపీఎస్ ఆధారిత ప్రదేశం కనుగొనటంతోపాటు బర్మా ఆరోగ్య సంరక్షణ వృత్తిదారుల సమాచార నిధితో మెమే అనుసంధానమై ఉంటుంది. తద్వారా వారికి సమీపంలోనే అందుబాటులోగల ఆరోగ్య కార్యకర్త, వారున్న ప్రదేశం, వారి సమాచారాన్ని గూగుల్ మ్యాప్స్ సహాయంతో అందిస్తుంది.*
- *వినియోగదారుల వివరాలు- ఈ యాప్ వినియోగదారులు తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దాంతోపాటు వారి చివరి రుతుక్రమం లేదా రాబోయే రుతుక్రమ తేదీని తెలపాలి. ఆ తర్వాత వారు గర్భం ధరిస్తే అప్పటి నుంచి వివిధ దశలకు అనుగుణంగా సూచనలు అందుతాయి. అలాగే తొలి గర్భమా, కాదా అనే అంశంపై ఎస్ఎంఎస్‌ల విధానాన్ని కూడా అనుసరిస్తారు. ఈ సంక్షిప్త సందేశాలు వద్దనుకుంటే ఏ సమయంలోనైనా నిలిపివేయవచ్చు... కావాలనుకుంటే మళ్లీ వచ్చేలా చేసుకోవచ్చు.*

*ఈ సమాచారం విశ్వసనీయంగా ఉండేందుకు వీలుగా ప్రసూతి కార్యాచరణపై సంచార కూటమి నుంచి సలహాలు స్వీకరిస్తారు. అలాగే సమాచారం పంపేముందు మయన్మార్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆమోదం తీసుకుంటారు. పంపిణీ చేసిన సమాచార విశ్వసనీయతను స్థానికీకరణ, భాషానువాదంద్వారా పీఎస్ఐకి చెందిన మయన్మార్ డాక్టర్లు సరిచూస్తారు. ఇది పూర్తిగా ఉచితమేగాక ఐవోఎస్, ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లతోనూ మెమే సేవలు పొందవచ్చు.*

## ప్రభావం

*మయన్మార్‌లో ప్రస్తుతం 11వేల మంది ఈ యాప్‌ను వినియోగిస్తున్నారు. జనాభాతో పోలిస్తే మొబైల్ చందాదారుల సంఖ్య పెరుగుదల 25 శాతం మాత్రమే అయినా ఒరీడో రూపొందించిన 'మెమే'ను 10వేల మంది తమ ఫోన్లలో నిక్షిప్తం చేసుకోగా, 2015 జనవరినాటికి ఫేస్‌బుక్‌ద్వారా 40వేల మంది అనుసరిస్తున్నారు. ప్రపంచ టెలికం వాణిజ్య ఆవిష్కరణ అవార్డు-2015 కింద ఈ యాప్‌కు 'ఉత్తమ వినియోగదారు సేవా ఆవిష్కరణ' పురస్కారం లభించింది. అలాగే టెలికం ఆసియా అవార్డు-2015 కింద 'ఉత్తమ సామాజిక టెలికం ప్రాజెక్టు' అవార్డు కూడా దక్కింది.*

### 4.2.3 సామాజిక - ఆర్థిక భాగస్వామ్యానికి అవకాశాలు

అభివృద్ధికి అనువైన కీలక సేవలందించే యంత్రాంగాలుగా ఐసీటీ పరిజ్ఞానాలు ప్రపంచవ్యాప్తంగా పరిగణన పొందుతున్నాయి. ఇంటర్నెట్, వైర్‌లెస్ సమాచార-ప్రసారం, వివిధ సందేశ పరిజ్ఞానాల మధ్య అనువర్తిత అనుసంధానం ప్రపంచ జనాభాకు సాధికారిక కల్పనలో దోహదపడ్డాయి. దీంతో వర్తమాన, భవిష్యత్ తరాల జీవితాలు మెరుగుపడతాయన్న భరోసా కల్పించాయి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారుసహా మహిళల సామాజిక

– ఆర్థికాభివృద్ధిలో ఐసీటీ ప్రాముఖ్యం చాలా ఎక్కువ. వాస్తవానికి ఆన్‌లైన్ అనుసంధానంలో మహిళలు, బాలికల సంఖ్యను రెట్టింపు చేయగలిగితే వర్ధమాన దేశాల దేశీయ స్థూలోత్పత్తి (GDP)లో అదనపు పెరుగుదల 1300 కోట్ల డాలర్ల నుంచి 1800 కోట్ల డాలర్లదాకా ఉండగలదని అంచనా. అలాగే ఇది అమ్మకాలు, నెట్‌వర్క్ లభ్యతకు వేదికగా నిలిచి 5వేల కోట్ల డాలర్ల నుంచి 7వేల కోట్ల డాలర్ల విలువైన సరికొత్త విపణిని ఆవిష్కరిస్తుందని అంచనా.

**అ**భివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలలో ఇంటర్నెట్ వినియోగం మహిళల ఆదాయాన్ని మరింత పెంచగలదు. వివిధ దేశాలలో ఇంటెల్ సంస్థ ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో పాల్గొన్న దాదాపు సగం మంది మహిళలు ఉద్యోగాన్వేషణ కోసం ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇక ఇంటర్నెట్‌ను వినియోగించే మహిళల్లో 30 శాతం అదనపు ఆదాయార్జన వనరుల కోసం శోధిస్తున్నట్లు తేలింది. కాగా, ఇంటర్నెట్‌ద్వారా తాను 'ప్రపంచవ్యాప్త స్వచ్ఛంద పాత్రికేయురాలు'గా అవకాశం పొందినట్లు భారత్‌నుంచి అధ్యయనంలో పాల్గొన్న ఒక మహిళ తెలుపడం గమనార్హం. మహిళలు ఆర్థిక సాధికారిక సాధించేందుకు ఐసీటీ తోడ్పడుతున్నదని చెప్పడానికి 'ఉసాహ వనితా మొబైల్ సేవ' ఒక మంచి ఉదాహరణ. ఇండోనేషియాలోని మహిళా వ్యాపారుల కోసం చెరీ బ్లేర్ మహిళా ఫౌండేషన్ దీన్ని రూపొందించింది. ఉత్పత్తి వ్యయాల తగ్గింపు, వ్యాపార విస్తరణలో వారి కృషికి తోడ్పడే సమాచారాన్ని అందించడంద్వారా ఇది మార్గనిర్దేశం చేస్తుంది. దీనికి సంబంధించిన వివరాలను నిదర్శనాధ్యయనం 8లో చూడవచ్చు.

## నిదర్శనాధ్యయనం 8:

### ఇండోనేషియాలో 'ఉసాహ వనిత' మొబైల్ సేవ

### ఏమిటిది?




*ఇండోనేషియాలో 'ఉసాహ వనిత' (స్థానిక భాషలో మహిళా పారిశ్రామికవేత్త అని అర్థం) మొబైల్ సేవను ఎక్సాన్ మోబిల్ ఫౌండేషన్, నోకియా, ఇండోశాట్‌ల భాగస్వామ్యంతో 2012లో ప్రారంభించారు. దేశంలో మహిళా పారిశ్రామికవేత్తలకు ఎదురవుతున్న అవరోధాల నిర్ధారణకు లోతైన పరిశోధన నిర్వహించారు. దాని ఆధారంగా వారికి సహాయపడే బోధనోపకరణంగా ఓ మొబైల్ యాప్‌ద్వారా ఈ సేవలకు రూపకల్పన చేశారు. వారికి అవసరమైన వ్యాపార మెలకువలతోపాటు మార్కెట్ సమాచారాన్ని అందించడంద్వారా నిర్దిష్ట సవాళ్లను అధిగమించేందుకు ఈ యాప్ తోడ్పడుతుంది. ఆ మేరకు ఇండోనేసియాలోని మెర్సీ కోర్‌తో సంయుక్తంగా వ్యాపారాభివృద్ధికి ప్రయోగాత్మక మద్దతునిస్తుంది. ఇలా ఇప్పటిదాకా 2వేల మంది మహిళలకు వ్యాపార సామర్థ్య నిర్మాణంలో సేవలందించింది.*

## ప్రభావం

***ఇం**డోనేషియాలోని 14వేల మందికిపైగా మహిళలకు ఉసాహ వనిత మొబైల్ యాప్ చేరువైంది. ఈ సేవలను తొలుత నైజీరియా, టాంజానియాలోని మహిళా పారిశ్రామికులకు అందించగా నేటిదాకా ఈ యాప్ మొత్తంమీద లక్షమందికి అందుబాటులోకి వచ్చింది. దీనికి ప్రపంచ టెలికం వాణిజ్య ఆవిష్కరణ అవార్డు-2013 కింద 'ఉత్తమ వినియోగదారు సేవా ఆవిష్కరణ' పురస్కారం లభించింది. ఇండోశాట్ మహిళా లక్షిత ఆర్థిక నిర్వహణ, జీవన నైపుణ్యం, ఆరోగ్యం, శిశు సంరక్షణలపై సంక్షిప్త సందేశాలద్వారా ముఖ్యమైన సమాచారం అందించే మొబైల్ సేవ 'ఇన్ఫో వనిత'కు అనుబంధంగా ఉసాహ వనిత పనిచేస్తుంది.*

***స**మయం, డబ్బు ఆదా చేయడంద్వారా సమర్థతను ఐసీటీ పెంచగలుగుతుంది. పట్టణ-గ్రామీణ ప్రాంతాల్లో గంటలకొద్దీ సమయంతో ముడిపడిన అనేక సమస్య (ఉదా॥ పత్రాల సుదూర బదిలీ-భాగస్వామ్యం, బిల్లుల చెల్లింపు, ఉద్యోగాన్వేషణ వగైరా)లను ఐసీటీ సరళం చేసింది. ఇప్పుడు చిన్న, మధ్య, భారీతరహా వ్యాపారాలన్నిటా ఐసీటీ వేదికల వినియోగం ప్రభావవంతంగా సాగుతోంది. ప్రస్తుత ఖాతాదారులతో సంభాషించడానికి, ఉత్పత్తుల స్థానికీకరణతో పాటు ప్రచారానికి, కొత్త సముదాయాల-వినియోగదారుల అన్వేషణకు ఎంతగానో ఉపయోగపడుతోంది. అయితే, ఐసీటీని అందుకోగల సామర్థ్యంతోపాటు దైనందిన కార్యకలాపాల్లో వాడుకోవడంలో... ప్రత్యేకించి వర్ధమాన ప్రపంచంలో చాలా అసమానతలు ఇంకా కొనసాగుతున్నాయి.*

### 4.2.4 రాజకీయ భాగస్వామ్యానికి అవకాశాలు

**మ**హిళల్లో రాజకీయ చైతన్యం పెరిగి, ప్రజా జీవనంలో చురుకైన భాగస్వామ్యం అందుకోగలగటం సంపూర్ణ మహిళా సాధికారిక సాధనలో ఒక ముఖ్యమైన కోణం. ఆ మేరకు మహిళల రాజకీయ సాధికారికకు ఐసీటీ కీలక చోదకం కాగలదు. వివిధ సామాజిక మాధ్యమాలద్వారా మహిళా ఉద్యమకారులు ఆన్‌లైన్‌లో ప్రచారం చేపట్టి అనేక విస్తృత రాజకీయ ఉద్యమాలకు నాంది పలికారు. అమెరికాలో 'ఆక్రమణ', ఈజిప్టుతోపాటు బహ్రెయిన్, ట్యునీసియాలలో 'అరబ్ వసంతం', బంగ్లాదేశ్‌లో 'షాబాగ్' ఉద్యమాలే ఇందుకు నిదర్శనం. ఆన్‌లైన్‌లోనేగాక ప్రత్యక్షంగానూ వేలాదిగా మహిళలు ఈ ఉద్యమాల్లో పాల్గొన్నారు. సంప్రదాయ సామాజిక ఆధిపత్య ధోరణుల నిర్మూలనలో మహిళల సామాజిక-ఆర్థిక నేపథ్యాలతో నిమిత్తం లేకుండా సరికొత్త మాధ్యమాలు (సామాజిక, వెబ్‌సైట్, మొబైల్ యాప్ వగైరా..) వారికి చక్కగా తోడ్పడగలవని లైంగికాంశాల పరిశోధకులు కనుగొన్నారు.

**అ**నేక సామాజిక సమస్యలపై మహిళలు ఒక్కటై తమ గళం వినిపించగల వేదికను ఐసీటీ సమకూరుస్తుంది. ఉదాహరణకు... "సాంకేతికతను తోడుగా ఉంచుకోండి" పేరిట ప్రపంచవ్యాప్తంగా సాగిన ప్రచారం మహిళలపై హింసను రూపుమాపేందుకు ఐసీటీ వినియోగం గురించి వివరించింది. ఆన్‌లైన్ లేదా మొబైల్ నెట్‌వర్క్‌లద్వారా మహిళలకు ఎదురయ్యే హింసాత్మకతపై ఈ ప్రచారం అవగాహన కల్పించింది. సామూహిక చర్యలు, సామాజిక మాధ్యమ ప్రచారం, సాంకేతికతల సమర్థ వినియోగంద్వారా అటువంటి చర్యలను నిరోధించే మార్గాలను మహిళలకు చేరువ చేయడంలో తోడ్పడింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, కంబోడియా, ఇండియా, మలేషియా, ఇండోనేషియా, పాకిస్థాన్, ఫిలిప్పైన్స్, శ్రీలంక దేశాల్లో ఈ ప్రచారోద్యమం కింద వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా హక్కుల సంస్థలు, ఐసీటీ సంస్థలు వీటికి పూర్తి మద్దతునిచ్చాయి.

**అ**భివృద్ధి చెందిన దేశాలలో రాజకీయ సమాచారాన్ని ఆన్‌లైన్‌ద్వారా పొందటంలో లైంగికపరమైన వ్యత్యాసాలు క్రమంగా తగ్గిపోతున్నాయి. 'ప్యూ పరిశోధన కేంద్రం' 2010లో అధ్యయనం నిర్వహించగా రాజకీయ ప్రచారం, ఎన్నికల వార్తల సమాచార ప్రధాన వనరుగా పురుషులలో 25 శాతం, మహిళల్లో 24 శాతం వంతున ఇంటర్నెట్‌నే వినియోగించారని తేలింది. సాధారణ ప్రజానీకానికి స్వేచ్ఛగా, ప్రభావవంతంగా తమ సందేశం చేరవేయడంలో మహిళా రాజకీయవేత్తలకు ఐసీటీ దోహదపడినట్లు ఐరోపా సమాఖ్య పార్లమెంటేరియన్లపై ఇటీవల నిర్వహించిన పరిశోధనలో స్పష్టమైంది. ఐసీటీ తోడ్పాటువల్ల సంప్రదాయ సమాచార మార్గాలు, సంబంధిత అవరోధాలను అధిగమించగలిగామని వారు వివరించారు. ఇలాంటి అవరోధాలు ప్రభుత్వంలో మహిళల పాత్రను నిర్వచించేందుకు యత్నిస్తాయని, తద్వారా తమ రాజకీయ భవితకు హాని కలిగిస్తాయని పేర్కొన్నారు.

**స**ంప్రదాయ మాధ్యమాలు కొన్ని సందర్భాల్లో మహిళలకు ఎదురయ్యే సమస్యలపై వారి గళం వినిపించడానికి ప్రాధాన్యం ఇవ్వవు. అందువల్ల మహిళలు రాజకీయాల్లో మరింతగా నిమగ్నమయ్యేందుకు ఐసీటీతోపాటు సామాజిక మాధ్యమాలు అత్యుత్తమ ఉపకరణాలు కాగలవు. దక్షిణాసియాలో మహిళా సాధికారికపై ఇటీవలి పరిశోధన సందర్భంగా– ఐసీటీయే తమకు ప్రపంచాన్ని చూపే కిటికీ వంటిదని, తమ గళాన్ని వినిపించే వేదికని ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, ఇండియా, పాకిస్థాన్ దేశాల మహిళలు చెప్పారు. మహిళలు తమకంటూ సమాచార సంబంధాలను, సామాజిక–రాజకీయ భావాలను పంచుకునే వేదికను సృష్టించుకోవడంలో ఐసీటీ ఎంతో సహాయపడుతుంది.

**ఇలా చేయండి:**

వ్యక్తిగతంగా లేదా మిత్రులతో కలిసి కింది సమస్యలను పరిశీలించండి:

- **మీ దేశం/సమాజంలో మహిళలు తమను తాము సాధికారులను చేసుకునేందుకు ఐసీటీ ఏయే మార్గాల్లో తోడ్పడగలదు?**
- **పారిశ్రామికత, విద్య, ఆరోగ్యం, రాజకీయ భాగస్వామ్యాల దిశగా మీ సమాజంలోని మహిళలకు ఐసీటీ సాయపడగల నిర్దిష్ట మార్గాలేవి?**

## 4.3 ఐసీటీ వినియోగంలో మహిళలకు సవాళ్లు

**ఐ**సీటీ శక్తిని అందుకోవడం, వినియోగించడంలో మహిళలకు ప్రతికూలతలే అధికం. పురుషులతో పోలిస్తే మహిళల్లో ఇంటర్నెట్ వినియోగం సగటున 25 శాతం తక్కువ. దక్షిణాసియా, పశ్చిమాసియాలతోపాటు ఆఫ్రికా, ఉత్తర ఆఫ్రికాలలోని సహారా ప్రాంత దేశాల్లోనూ ఇదే వ్యత్యాసం కనిపిస్తుంది. ఐసీటీ ఆధారిత అనువర్తనాలు, ఉపకరణాల (ఉదా॥ టెలిఫోన్, వ్యక్తిగత కంప్యూటర్, ఇంటర్నెట్, ఇతర డిజిటల్ ఆవిష్కరణలు) లభ్యత, అందుబాటు, సరళత, వినియోగంపరంగా వివిధ జనబాహుళ్యాల మధ్య వ్యత్యాసం స్పష్టమవుతోంది. ప్రపంచ జనాభాలో 15 శాతానికి మాత్రమే ప్రస్తుతం బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సేవ అందుబాటులో ఉంది. ఐసీటీ అనువర్తనం అత్యధికంగాగల మొబైల్ ఫోన్‌ను ప్రపంచ జనాభాలో 80 శాతం ఇప్పుడు ఉపయోగిస్తోంది.

అయితే, ఇంకా 200 కోట్లమందికి నేటికీ సొంత ఫోన్ లేకపోగా, 60 శాతం జనాభా ఆన్‌లైన్‌తో అనుసంధానం కాలేదు.

**బ**హుశా టెలి కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలు (బ్రాడ్‌బ్యాండ్ లేదా మొబైల్‌కు వెన్నెముక వంటి నెట్‌వర్క్, యాంటెన్నాల ఏర్పాటు) అధిక వ్యయంతో కూడినవి కావడం ఇందుకు ఓ కారణం కావచ్చు. ప్రత్యేకించి జనసంఖ్య పలచగా ఉన్న పెద్దపెద్ద గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువ. అయితే, నెట్‌వర్క్ అందుబాటులో ఉన్న చోట్ల ఐసీటీని విస్తృతంగా వినియోగించాలంటే ప్రత్యేకించి అణగారిన వర్గాల్లోని మహిళలు, పెద్దలకు అధిక వ్యయం ఒక అడ్డంకిగా ఉంది. "సరళ రీతిలో లేకపోవడమే తమకు ఒక అడ్డంకిగా ఉందని ఆన్‌లైన్‌లోకి ఇంకా రానివారు చెబుతుండగా, అదే కారణంవల్ల మరింతగా వినియోగించలేక పోతున్నట్లు ప్రస్తుత వినియోగదారులు చెప్పారు. లైంగికపరమైన అవరోధాలున్నట్లు తరచూ వెల్లడవుతున్నా ధర అందుబాటే మహిళల విషయంలో స్పష్టమైన అడ్డంకిగా ఉంది" అని 'మహిళలు–వెబ్ ప్రపంచం' పేరిట ఇంటెల్ సంస్థ నిర్వహించిన అధ్యయనం తేల్చింది. ఇక అనుసంధానత పెరిగినంత మాత్రాన సమాచార సేకరణ, భాగస్వామ్యంలో సమానత్వానికి హామీ లేదు. స్థానిక సమాచార అందుబాటుకు సంబంధించి వర్ధమాన దేశాలకు ఆన్‌లైన్ ప్రాతినిధ్యం గణనీయంగా తక్కువగా ఉందని, విషయ సంగ్రహంలో 85 శాతం అమెరికా, కెనడా, ఐరోపాలనుంచే ఉత్పన్నమవుతున్నదని గూగుల్ రూపొందించిన సూచీలు పేర్కొంటున్నాయి.

**అ**ంతేకాకుండా ఇంటర్నెట్ తమకు అనువైనదిగా పరిగణించడంలేదని భారత్, ఈజిప్టు దేశాల్లో సగటున ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరు పేర్కొన్నట్లు ఇటీవలి నివేదిక ఒకటి తెలిపింది. ఆన్‌లైన్ సంబంధిత కార్యకలాపాల్లో నిమగ్నం కావడమేమీ ప్రయోజనకరం కానందువల్ల తమ కుటుంబాలు అందుకు ఆమోదించవని వారు చెప్పినట్లు వివరించింది. ఇక ప్రపంచంలోని కొన్ని సమాజాల్లో అంతర్గత లైంగికపరమైన నియమాలవల్ల ఇంటర్నెట్‌పై అభ్యంతరాలున్నట్లు తేలింది. కాగా, ఐసీటీలో మహిళలకు తగిన నైపుణ్యం సాధ్యంకాదని కూడా అనేక సమాజాలు భావిస్తున్నాయి. ఇటువంటి మూస ధోరణులే పని ప్రదేశాల్లో, విద్యాసంస్థల్లో, బహిరంగ స్థలాల్లో మహిళలకు ఆన్‌లైన్ అందుబాటును దూరం చేస్తున్నాయి.

**మ**హిళలకు సామాజికంగా, ఆర్థికంగా సాధికారిక సిద్ధించడంలో ఐసీటీ తోడ్పడినప్పటికీ కొన్ని ఐసీటీ అనువర్తన సంబంధ చిక్కులు అనేక ముప్పులకు దారితీశాయి. మహిళలపై ఆన్‌లైన్ హింస ప్రపంచవ్యాప్తంగా పెరిగింది. వర్ధమాన దేశాల్లోనేగాక అభివృద్ధి చెందిన దేశాల్లోనూ మహిళలకు బెదిరింపులు, మోసాలు, ప్రతీకార అశ్లీలత, సైబర్ వేధింపులు వంటివి ఒకేరకంగా ఉంటూ శారీరక, మానసిక హానికి గురిచేస్తున్నాయి. ఇటువంటి నేరాల గురించి ఫిర్యాదు చేయడంలో సాధారణ ప్రజానీకానికి అవగాహన లేనందువల్ల ఆ సంఘటనల దుష్ప్రభావం మరింతగా ఉంటోంది.

**సా**మాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ వంటివాటిలో గోప్యత ఉల్లంఘనలు మహిళా వినియోగదారులపై దుష్ప్రభావం చూపాయి. ముఖ్యంగా సంప్రదాయ సమాజాల్లో మహిళలు ఐసీటీని వినియోగించడంపై నిషేధం విధించేందుకు ఇలాంటివి సాకులుగా మారాయి. అన్‌లైన్ హింస, నేరాలు మహిళల వ్యక్తిగత భద్రతకు ముప్పు కలిగించి, ఐసీటీద్వారా మహిళా సాధికారిక సాధన ప్రక్రియకు అవరోధంగా నిలుస్తున్నాయి. ఇక ఆన్‌లైన్ వినియోగ, ఐసీటీ విధానాలతోపాటు సైబర్ చట్టాల అమలు దారుణంగా ఉ

ండటంవల్ల ఇంటర్నెట్, ఐసీటీ ఆవిష్కరణలు మహిళా వినియోగదారులకు రక్షణలేనివిగా మారాయి. ఉదాహరణకు – బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్, టెలికమ్యూనికేషన్ రంగాల కోసం వందకుపైగా దేశాల్లో ప్రభుత్వాలు అధికారిక విధానాలను రూపొందించాయి. కానీ, ఇవన్నీ లైంగికపరమైన సవాళ్లను ఎదుర్కొనడం గురించి యోచించకుండా రూపొందించినవే. అంటే– మహిళలు, బాలికలకు వెబ్‌సైట్లలో గౌరవప్రదమైన ప్రాతినిధ్యం, బహిరంగ ఇంటర్నెట్ సురక్షిత అందుబాటు గురించి పట్టించుకోనివనే చెప్పాలి.

**వి**ధానాల రూపకల్పన–అమలు లోపభూయిష్టంగా ఉండటానికి దారితీసే ప్రధాన కారణాల్లో నిర్దిష్ట సమాచార లోపం కూడా ఒకటి. సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలో లైంగికపరమైన విశ్లేషణతో కూడిన సమాచారం ప్రభుత్వాలకు అందుబాటులో ఉండటమన్నది ఎంతో ప్రధానాంశం. లోతైన సమాచారం ఉన్నపుడు క్షేత్రస్థాయి పరిస్థితులపై మెరుగైన విశ్లేషణతో తగినవిధంగా స్పందించడం వీలవుతుంది. ఆన్‌లైన్ బెదిరింపులు, ప్రతీకార అశ్లీలత సంబంధిత నేరాలపై అభివృద్ధి చెందిన దేశాల్లోనూ నేరగాళ్లను శిక్షించడంలో ప్రస్తుత చట్టాలు సమర్థమైనవి కావని కూడా కొన్ని సందర్భాల్లో స్పష్టమవుతోంది. ఇక వర్ధమాన దేశాల్లో ఇలాంటి నేరగాళ్ల బారినపడిన బాధితులకు రక్షణ కల్పించడంపై న్యాయ, చట్ట వ్యవస్థలకు సరైన మార్గదర్శకాలు లేవు.

**మ**హిళా సాధికారికకు ఐసీటీ వినియోగం ఎంతో ప్రయోజనకరమని చెప్పడానికి ఎన్నో రుజువులున్నా మహిళలు తమ జీవితాలను మెరుగుపరచుకునేందుకు ఐసీటీని వాడుకోవడంపై ఇంకా ఎన్నో అడ్డంకులు తప్పడంలేదు. సమాజంలో మహిళలపైగల వివక్షపూరిత సంప్రదాయాలను ఆన్‌లైన్ ఉపకరణాలు, అనువర్తనాలతో రెట్టింపు స్థాయికి పెంచి ఆన్‌లైన్‌కు బదిలీ చేస్తున్నట్లు ఇటీవలి పరిశోధనలో వెల్లడైంది. అనేక సందర్భాల్లో వాస్తవ పురుషాధిక్య ప్రపంచంలోని యథాతథ స్థితినుంచి బయటపడలేని కారణంగా ఐసీటీ వినియోగంద్వారా తమ కర్తృత్వ నిరూపణలో మహిళలు విఫలమవుతున్నారు.

## మిమ్మల్ని మీరు పరీక్షించుకోండి:

- **మహిళలకు సహాయపడ గరిగే ఐసీటీ అనువర్తనాలేమిటి?**
- **ఆర్థిక స్వేచ్ఛ.. తదుపరి సాధికారిక సాధనలో సాంకేతికతను మహిళలు వినియోగించుకోవడం ఎలా?**
- **ఐసీటీ వినియోగంలో మహిళలకుగల సవాళ్లేమిటి? అలాంటి అవరోధాలను తొలగించడం ఎలా?**

## కీలక సందేశాలు:

- **ఐసీటీ వినియోగంద్వారా సామాజిక పరివర్తనతోపాటు స్త్రీపురుష సాధికారికకు దోహదపడవచ్చు**
- **మహిళా సాధికారికకు ఐసీటీ వినియోగంతో... సమాచారం మరింతగా అందుబాటు, ప్రభుత్వ సేవల లభ్యత, ఆర్థిక–రాజకీయ భాగస్వామ్యం వంటి ప్రయోజనాలు సిద్ధిస్తాయి.**
- **ఐసీటీని చురుగ్గా వినియోగించడంద్వారా మహిళలు తమ జీవితాలపై స్వీయ నియంత్రణ కోసం చేసే ప్రయత్నాలకు సామాజిక–ఆర్థికాంశాలు అడ్డంకులవుతాయి**

## 5. సారాంశం

**ఇ**టీవలి నిదర్శనాధ్యయనాలు, ఉదాహరణల ద్వారా మహిళా సాధికారికకుగల సవాళ్లు, అవకాశాలను విశ్లేషించి దాన్ని సాధించేందుకు చేపట్టాల్సిన చర్యలను ఈ విభాగం వివరిస్తుంది. ఈ నేపథ్యంలో ఇటీవల అనుసరిస్తున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (SDG)తో స్పష్టమైన సంబంధాన్ని కూడా ప్రముఖంగా చూపుతుంది. ఈ పర్యికలోని 3 విభాగాలు ప్రధాన సామాజిక–ఆర్థికాంశాలు, విధాన రూపకల్పన, నియంత్రణ పద్ధతులు, మహిళా సాధికారిక కల్పనలో ఐసీటీ పాత్ర, తద్వారా సుస్థిర ఆర్థిక లక్ష్యాల సాధన (ప్రత్యేకించి SDG 5)పై దృష్టి సారించాయి. మహిళలు ఐసీటీని సమర్ధ ఉపకరణం చేసుకుని తమకు తాము ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా సాధికారిక సాధించగలరని అధ్యయనాలు నిరూపించాయి. మొత్తంమీద ఆర్థిక, సామాజిక పరివర్తన దిశగా అవకాశాలను ఐసీటీ నాటకీయంగా పెంచింది. ఇక "మహిళా పారిశ్రామికుల కోసం ఐసీటీ సహాయక పాత్ర" పేరిట సమాచార సేకరణ ప్రక్రియను, విజయవంతమైన మహిళా పారిశ్రామికతకు మద్దతునివ్వడంలో ఐసీటీ పాత్రను, అంతిమంగా మహిళా సాధికారికకు ఐసీటీ అందించగల తోడ్పాటును పర్యిక (మాడ్యూల్) సి2 వివరిస్తుంది.

**మాడ్యూల్ సి1**: జాతీయంగా మారుతున్న, విభిన్న పరిస్థితులకు తగినట్లు మహిళా సాధికారిక, ఎస్‌డీజీలు, ఐసీటీ అంశాలతో భిన్నవర్గాలు (పారిశ్రామికులు, విధాన రూపకర్తలు) లక్ష్యంగా ఈ పర్యిక రూపొందింది. అలాగే ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో మొత్తంగా లేదా ఒక భాగంగా వేర్వేరు పద్ధతుల్లో ప్రదర్శించేందుకు వీలుగానూ తయారైంది. ఈ పర్యికను వ్యక్తులు, బృందాలు విడివిడిగా లేదా శిక్షణ సంస్థలలో సామూహికంగానేగాక ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అధ్యయనం చేయవచ్చు. పాల్గొనేవారి నేపథ్యం, శిక్షణకాల వ్యవధినిబట్టి ఇందులోని సారాంశాన్ని సమగ్రంగా వివరించే వీలుంటుంది. శిక్షకులు ఈ పర్యికను ప్రభావవంతంగా వివరించేందుకు దిగువ ఇచ్చిన 'ముఖ్యాంశాలు' కొన్ని ఆలోచనలు, సూచనలిస్తాయి.

### విషయం - వివరణ పద్ధతి

**సు**స్థిర అభివృద్ధిలో మహిళా సాధికారిక ఎలా సమగ్ర భాగం కాగలదో ఈ పర్యిక అన్వేషిస్తుంది. ఈ దిశగా సామాజిక ప్రక్రియలకు మద్దతునిచ్చి, ఎస్‌డీజీలవైపు నడిపించేలా సమాచార, సందేశ సాంకేతిక పరిజ్ఞానాలను వాడుకోవచ్చునో సూచిస్తుంది. ఇందులో తొలి విభాగం మహిళా సాధికారిక భావన, దాని ప్రాముఖ్యాలను పరిచయం చేసి వాస్తవ ప్రాపంచిక ఉదాహరణలతో విశదీకరిస్తుంది. మహిళా సాధికారికకు ప్రధాన సహాయకారకాలు, అడ్డంకుల గురించి రెండో విభాగం వివరిస్తుంది. ఇందులో ప్రత్యేకించి విద్య, విధాన రూపకల్పన, నియంత్రణ పర్యావరణం, పారిశ్రామికత, సామాజిక – సాంస్కృతిక నియమాలు తదితరాల గురించి వివరణ ఉంటుంది. ఇక మహిళా సాధికారికను ప్రోత్సహించడంలో ఐసీటీ పాత్ర, ఆ మార్గంలో ఎదురయ్యే సవాళ్లను మూడో విభాగం పరిశీలిస్తుంది.

### నిర్దిష్ట లక్షిత వర్గాలు

**ప్ర**స్తుత, కాబోయే మహిళా పారిశ్రామికులు, సామాజికాభివృద్ధికి కృషిచేసేవారు లక్ష్యంగా ఈ పర్యిక రూపుదిద్దుకుంది. దీని నిర్దిష్ట లక్షిత వర్గాలలో ప్రభుత్వంలోని మంత్రులు, పార్లమెంటు సభ్యులు, రాజకీయ నాయకులు, సీనియర్ అధికారులు, వ్యూహకర్తలు, విశ్లేషకులు తదితర ప్రగతి సాధకులు కూడా ఉన్నారు.

అంతేకాకుండా ప్రైవేటు రంగ పెట్టుబడిదారులు, ఐసీటీ సేవా ప్రదాతలు, ఇతర సంబంధిత భాగస్వాములు కూడా వీరిలో భాగం కావచ్చు. పౌర సమాజం... విద్యారంగం, విద్య, పరిశోధన, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సాధికారిక – పారిశ్రామికత, స్థానిక –సామాజిక స్థాయిలలో ఐసీటీలపై కృషిచేసేవారికీ ఈ పర్వికె వర్తిస్తుంది.

**మా**డ్యూల్ సి1 అనుసరణీయమైనది. మహిళా సాధికారతకుగల సవాళ్లు–అవకాశాల్లో భిన్నత్వం, విజయవంతమైన పారిశ్రామికత ప్రయత్నాలు, సంబంధిత ఐసీటీ పరిజ్ఞానం తదితరాలు ఇందులో సమృద్ధిగా ఉన్నాయి. లక్షిత వర్గాలకు విశేషంగా ముఖ్యమైనవిగా పరిగణించదగిన దేశాలు, ప్రాంతాల సంబంధిత ప్రత్యేక సమాచార, నైపుణ్యాంశాలున్నాయి. ఇందులో ఉటంకించిన వనరుల ఆధారంగా కొన్ని పరిశోధనలు, సంప్రదింపులు,భిన్న వర్గాలకు అనువర్తనంలో వైవిధ్యాలను అభివృద్ధి చేయవచ్చు.

**శిక్షణ తరగతుల రూపకల్పన**

**శి**క్షణార్థులనుబట్టి, సమయ లభ్యత, స్థానిక పరిస్థితులు–ఏర్పాట్లకు అనుగుణంగా ఈ పర్వికలోని విషయాన్ని విభిన్న కాల ప్రణాళికల కింద విభజించి వివరించవచ్చు. భిన్న వ్యవధి తరగతులకు అనుగుణంగా ఏయే అంశాలను బోధించాలో దిగువన వివరించాం. దేశం, శిక్షణార్థులపై అవగాహన మేరకు శిక్షకులు ఈ తరగతుల స్వరూపాన్ని సవరించవచ్చు. పరస్పర అన్యోన్య సంభాషణంద్వారా అభ్యాస అనుభవం పొందేవిధంగా మాడ్యూల్ సి1 సిద్ధమైంది. తరగతులలో పాల్గొనేవారు తమవంతుగా చర్చల్లో భాగస్వాములు కావాలి. చర్చనీయాంశం వినూత్నమైనది గనుక నిదర్శనాధ్యయనాలు, వినియోగానుభవాలపై సమాచార సేకరణ కోసం ఇందులో పాల్గొనడం తప్పనిసరి.

**90 నిమిషాల తరగతి కోసం...**

**ప**ర్వికకు సంబంధించి సంక్షిప్త అవగాహన కల్పించాలి. చర్చాగోష్ఠిలో చర్చనీయాంశం దిశగా ప్రతి విభాగంలోని పరిచయ భాగాన్ని ప్రస్తావించి, అత్యంత సముచిత అంశాలను శిక్షణార్థులకు లోతుగా తెలియజెప్పాలి. ఈ పర్వికలోని నిర్దిష్ట విభాగాలపైనా దృష్టి సారించవచ్చు. ఉదాహరణకు... మహిళా సాధికారిక సహాయకారకాలు – అవరోధాలు, మహిళా సాధికారికకు దోహదం చేయడం– ఐసీటీ వినియోగాన్ని ప్రోత్సహించడం వంటివాటిని తీసుకోవచ్చు.

**తరగతిలో పాల్గొనేవారు పారిశ్రామికులైతే శిక్షకులు కింది అంశాలకు ఎక్కువ సమయం కేటాయించాలి:**

- మహిళా సాధికారికకు సంబంధించిన నిదర్శనాధ్యయనాలు
- ఐసీటీ సంబంధిత ఆవిష్కరణలు (సాధికారిక ఉపకరణాలు, అనువర్తనాలు)

**పాల్గొనేవారు విధాన రూపకర్తలైతే శిక్షకులు కింది అంశాలకు ఎక్కువ సమయం కేటాయించాలి:**

- విజయవంతమైన మహిళా సాధికారికకు సంబంధించిన నిదర్శనాధ్యయనాలు
- మహిళా సాధికారిక కోసం విధాన రూపకల్పన, నియంత్రణ వాతావరణ సృష్టి

- విజయగాథలు, సవాళ్లు
- అంతర్జాతీయ–జాతీయ విధాన/నియంత్రణ పద్ధతులు
- సమాచార, సందేశ పరిజ్ఞానా (ఐసీటీ)ల పాత్ర

## మూడు గంటల తరగతి కోసం...

**పైన** చెప్పిన 90 నిమిషాల తరగతికి ఇది కొనసాగింపు. కొన్ని విభాగాలపై అధికంగా దృష్టి సారించేలా దీన్ని రూపొందించాలి. పాల్గొనేవారి నేపథ్యం ఆధారంగా పర్విక మొత్తాన్నీ స్పర్శించవచ్చు. ఆ తర్వాత నిర్దిష్ట విభాగాలు, ఉప విభాగాలపై దృష్టి పెట్టవచ్చు.

**మూడు గంటల తరగతిని రెండు 90 నిమిషాల తరగతులుగా కింద సూచించిన మేరకు విభజించవచ్చు:**

- తొలి తరగతిలో పర్వికలోని 1, 2 విభాగాలను బోధించవచ్చు. అందులో సంబంధిత నిదర్శనాధ్యయనాలపె చర్చలను, బృంద కసరత్తులను చేర్చవచ్చు. తరగతిపై ప్రతిస్పందనలు, నిర్దిష్ట దేశం/ సమాజ పరిధిలో ఎస్‌డీజీ సంబంధిత చర్చలను జోడించవచ్చు.

- రెండో తరగతిలో 3వ విభాగం, సంబంధిత నిదర్శనాధ్యయనాలు, బృంద కసరత్తులు, ఐసీటీకి నిర్దిష్ట ప్రాంతీయసవాళ్లు– అవకాశాలపై తరగతి అంతర్భాగ చర్చలు చేపట్టవచ్చు.

## తరగతిలో నిర్వహించే బృంద కసరత్తులపై ఉదాహరణల కోసం 'ఎక్సర్‌సైజ్'లలో చూడండి.

ఎంపిక చేసిన నిదర్శనాధ్యయనాలు, బృంద కసరత్తులు పాల్గొనే వర్గాన్నిబట్టి వేర్వేరుగా ఉంటాయి. **పారిశ్రామికులకై తే...** మహిళా సాధికారికకు మద్దతుగా ఐసీటీని ఎలా వినియోగించవచ్చునో వీలైనన్ని ఎక్కువ ఉదాహరణల్లో చెప్పాలి. **విధాన రూపకర్తలకైతే...** విధాన పద్ధతులు, సాధికారిక / ఐసీటీ అనువర్తనాల మధ్య అనుసంధానత అన్వేషణపై ఎక్కువగా దృష్టి సారించాలి.

## ఒక రోజు (ఆరు గంటలు) తరగతి కోసం...

- ఉదయపు తరగతి కోసం ప్రతి విభాగంమీద సమీక్షతోపాటు ఎంపిక చేసిన విభాగాల్లోని అంశాలపై దృష్టి పెట్టాలి. పాల్గొనే వర్గాన్నిబట్టి **పారిశ్రామికులైతే...** మూడుగంటల తరగతితో సమానంగా 3 విభాగాల నుంచీ మహిళా సాధికారికకు ఐసీటీ అనువర్తనాలపై దృష్టి పెట్టాలి. **విధాన రూపకర్తలకైతే...** విధానం– నియంత్రణ పద్ధతులపై దృష్టి సారించాలి.

- మధ్యాహ్న తరగతి కోసం నిదర్శనాధ్యయనాలపై చర్చలమీద దృష్టిపెట్టాలి. చర్చలపై ప్రశ్నలకు, పరస్పర అన్యోన్య కసరత్తులకు వీలు కల్పించాలి. పారిశ్రామిక శిక్షణార్థులకు ప్రస్తుత సమాజ పరిస్థితులలో మహిళా సాధికారికకుగల కీలక సవాళ్లు– అవకాశాలను గుర్తించే బాధ్యత అప్పగించాలి. విధాన రూపకర్తలైతే... దేశంలో మహిళా సాధికారిక – ఐసీటీకి సంబంధించిన ప్రస్తుత విధానాల బలాలు, బలహీనతలు, అవకాశాలు, ముప్పుల (SWOT)పై విశ్లేషణ కసరత్తు చేయించాలి. అనంతరం

ఐసీటీ పరిజ్ఞానాల్లో వారు కోరుకుంటున్నవాటికి సంబంధించి రెండు బృందాల మధ్య స్పందనాత్మక చర్చ నిర్వహించాలి. అలాగే ఐసీటీల వినియోగంలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లనూ ఇందులో చేర్చాలి.

- పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ల మధ్యలో బృంద చర్చలు, ఆచరణాత్మక కసరత్తులు చేయించాలి.

## పర్సిక సి1లో భాగస్వామ్యం

**ఈ** పర్సిక స్వీయ అధ్యయనంతోపాటు తరగతి గదిలో బోధనకు అనువుగా రూపొందించబడింది. అందువల్ల ప్రతి విభాగమూ అభ్యాస ఫలితాలపై ప్రకటనతో మొదలై, కీలకాంశాల సారాంశంతో ముగుస్తుంది. పర్సిక పొడవునా తమ ప్రగతిని అంచనా వేసుకునేందుకు అభ్యాసకులు ఈ రెండింటినీ ప్రాతిపదికగా తీసుకోవచ్చు. ప్రతి విభాగంలోనూ చర్చా ప్రశ్నలు, ఆచరణాత్మ కసరత్తులు ఉంటాయి. వాటిని వ్యక్తిగత అభ్యాసకులు పూర్తిచేయవచ్చు లేదా శిక్షకులు వాటిని వినియోగించుకుంటారు. అభ్యాసకులు ఈ పర్సికలోని విషయ స్థాయిని స్వీయానుభవంద్వారా అంచనా వేయడానికి, ప్రదర్శిత అంశాలపై స్పందనాత్మకంగా ఆలోచించటానికి వీలుగా సదరు ప్రశ్నలు, కసరత్తులు రూపొందాయి.

**UN-APCICT/ESCAP**
United Nations Asian and Pacific Training Centre for Information
and Communication Technology for Development
5th Floor G-Tower, 175 Art center daero,
Yeonsu-gu, Incheon City, Republic of Korea

www.unapcict.org